ప్రజాశక్తి
పశ్చిమగోదావరి
సోమవారం
జనవరి - 1
2018
12 పేజీలు



సిఎం మాట ఖాతరు చేస్తారా..!



- కోడిపందేలపై ఉత్కంఠ
- ప్రజాప్రతినిధులకు ముఖ్యమంత్రి వార్నింగ్
- బహిరంగ ప్రకటనలు చేస్తున్న ఎంఎల్ఎల్లో అయోమయం
- వెంపపైనే అందరి దృష్టి

కోడిపందేల్లో ఎంఎల్ఎలు తలదూర్చొద్దు, పాల్గొనొద్దు అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. సిఎం మాటను జిల్లాలోని ఎంఎల్ఎలు, ఎంపీలు ఖాతరు చేస్తారా.. అనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సిఎం మాట జిల్లాలో అమలైతే జిల్లా ప్రజలు సరికొత్త సంక్రాంతిని చూసినట్లు అవుతుంది. ముఖ్యమంత్రి మాటలు జిల్లా పోలీసుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని చెప్పొచ్చు. దీంతో ఇప్పటికే కోడిపందేలపై సీరియస్‌గా ఉన్న జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ మరింత కఠినంగా వ్యవహరించే అవకాశం ఉంది. కోడిపందేలకు అడ్డుకట్ట వేయగలిగితే జిల్లా పోలీసులు చరిత్ర సృష్టించినట్లే అవుతుంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సంక్రాంతి పండుగ మూడు రోజులు కోడిపందేలకు అడ్డుకట్ట వేయాలని ఎన్నోఏళ్లుగా జిల్లా ప్రజలు కోరుతున్నారు. కొంతమంది పందెంరాయుళ్లు తమ స్వలాభం కోసం సంప్రదాయం ముసుగులో జనాన్ని రెచ్చగొడుతూ (4లో)

పాలకొల్లులో బౌన్సర్లు (3లో)	ఆశల ప్రవాహానికి.. ఆనంద స్వాగతం (మధ్యపేజీల్లో)	సెల్‌ఫోన్లలోనే శుభాకాంక్షలు	చట్టాలను ఉల్లంఘించిన షాన్‌మోహన్‌పై కేసు (10లో)	పండుగ వాతావరణంలో జన్మభూమి నిర్వహించాలి (12లో)

న్యూ జోష్

జిల్లాలో అంబరాన్నంటిన నూతన సంవత్సర సంబరాలు

కొత్త ఊసులతో.. కొంగొత్త ఆశలతో, వెలుగుజిలుగులతో 2018 అడుగుపెట్టింది. గడిచిన ఏడాదిలో గతించిన స్మృతులను నెమరువేసుకుంటూ.. కొత్త ఏడాది ప్రణాళికలను, ఆశలను ఊహించుకుంటూ జిల్లావాసులు 2018కి ఘనంగా స్వాగతం పలికారు. యువత రయ్యీమంటూ బైక్‌లపై దూసుకెళ్తూ కేరింతలు కొడుతుంటే.. మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులతో కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించారు. అర్ధరాత్రి 12 గంటలు కాగానే బాణాసంచా వెలుగులు విరజిమ్మాయి. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ, కేక్‌లు కట్‌చేసి కొత్త ఏడాదిని సాదరంగా ఆహ్వానించారు. కలిసిన వారికి శుభాకాంక్షలు చెప్పుకుంటూ, ఫోన్లలో గ్రీటింగ్స్ పోస్టు చేస్తూ, ఫోన్లు చేస్తూ ఉత్సాహంగా అంతా వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రెస్టారెంట్లు, హోటళ్లు నూతన సంవత్సర వేడుకల సందర్భంగా విద్యుద్దీపాలతో ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి.

జన్మభూమి ప్రత్యేకాధికారులు వీరే

ప్రజాశక్తి - ఏలూరు

జనవరి రెండు నుండి 11వ తేదీ వరకూ నిర్వహించే జన్మభూమి కార్యక్రమానికి జిల్లాలోని 48 మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆచంట మండలానికి పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.గణపతి, ఆకివీడుకు పరిశ్రమల కేంద్రం డిప్యూటీ డైరెక్టరు వి.ఆదిశేషు, అత్తిలికి కెవిఐబి అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, భీమడోలుకు గృహనిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాసరావు, భీమవరానికి మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టరు కె.ఫణిప్రకాష్, బుట్టాయగూడేనికి మైన్స్ ఎబి పి.మోహన్‌రావు, చాగల్లుకు వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పిఎల్.వరలక్ష్మి, చింతలపూడికి డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్, ద్వారకాతిరుమలకు ఉద్యానశాఖ ఎడి-2 పి.బాలాజీకుమార్, దెందులూరుకు కెఆర్‌సి డిప్యూటీ కలెక్టరు వి.శైలజ, దేవరపల్లికి కొవ్వూరు వ్యవసాయ శాఖ ఎడి ఎస్‌జెవి.రామ్మోహన్, యలమంచిలికి పాలకొల్లు వ్యవసాయ శాఖ ఎడి ఎల్‌బివి.సత్యనారాయణ, ఏలూరుకు జిల్లా ఉపాధికల్పనా అధికారి ఆర్.రవికుమార్, గణపవరానికి డిఎస్ఒ సయ్యద్ యాసిన్, గోపాలపురానికి పోలవరం డిప్యూటీ కలెక్టర్ పి.శ్రీనివాసరావు, ఇరగవవరానికి హ్యాండ్‌లూమ్స్ ఎడి బి.ధనుంజయరావు, జంగారెడ్డిగూడేనికి టెరిటోరియల్ డిఎఫ్ఒ ఎన్.నాగేశ్వరరావు, జీలుగుమిల్లికి ఎపిఎంఐపి పీడీ కె.షాజానాయక్, కామవరపుకోట సోషల్ ఫారెస్టరీ డిఎఫ్ఒ ఎం.శ్రీనివాస్, కాళ్లకు ఎస్‌సి కార్పొరేషన్ ఇడి కె.రమేష్, కొవ్వూరుకు ఇందిరాసాగర్ స్పెషల్ (4లో)

గీతోపదేశం





సరిపల్లి ఆయకట్టులో ఎండిన వరి నారుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఎండుతున్న నారు.. రైతు కంటకన్నీరు

ప్రజాశక్తి - గణపవరం

'ముందస్తు సాగు చేపట్టండి.. నీరందిస్తాం' అని ప్రభుత్వం చెప్పిన మాటలు నీటి మీద రాతలుగా మారాయి. ప్రభుత్వ ప్రకటనలు నమ్మి దాళ్వా సాగుకు సమాయత్తమైన రైతులు సాగునీరందక అల్లాడుతున్నారు. నారుమడులు ఎండుతుండటంతో వ్యవసాయం చేయాలా.. వద్దా అని కొట్టుమిట్టాడుతున్నారు.

మండలంలోని అగ్రహార గోపవరం పంట కాల్వ ఆయకట్టులో సుమారు 2800 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ఈ కాల్వ శివారు గ్రామాలైన కొత్తపల్లి సరిపల్లిలో 650 ఎకరాల్లో సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. ముందస్తు సాగు చేపట్టాలన్న అధికారుల పిలుపుతో (4లో)

3న మున్సిపల్ కార్మికుల సామూహిక రాయబారాలు

ప్రజాశక్తి - ఏలూరు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల మూడో తేదీన మున్సిపల్ కమిషనర్లు, ఛైర్మన్లకు రాయభారాలు జరపాలని వినతిపత్రాలివ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్(సిఐటియు) జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. మున్సిపల్ పర్మినెంట్ సిబ్బందికి డిఎ బకాయిలు, జిపిఎఫ్ ఖాతాల వివరాలివ్వాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, కాంట్రాక్టు సిబ్బందికి జిఒ 151 ప్రకారం వేతనం రూ.12వేలు ఇవ్వాలని కోరారు. 2016 ఆగస్టు నుండి ఏరియర్స్ ఇవ్వాలని, ఇంజనీరింగ్ సిబ్బందికి స్కిల్డ్, సెమీస్కిల్డ్, జీతాలివ్వాలని కోరుతూ ఈ రాయబారాలు జరపాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధనాల వెంకటరావు, బి.సోమయ్య కోరారు. జిల్లాలోని ఏలూరు కార్పొరేషన్‌తో పాటు ఎనిమిది మున్సిపాలిటీల్లో వినతిపత్రాలిచ్చే కార్యక్రమం నిర్వహించాలని వారు కోరారు. కాంట్రాక్టు కార్మికుల ఐదు రోజుల సమ్మె సందర్భంగా మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారుకోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీనత వల్ల రెండు సంవత్సరాలుగా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.

నేడు ఐచ్ఛిక సెలవు లేదు : డిఇఒ రేణుక

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఈ నెల రెండో తేదీ నుండి 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమం ఉన్నందున జిల్లాలోని అన్ని పాఠశాలలూ ఒకటో తేదీన యథావిధిగా పనిచేయాలని డిఇఒ సివి.రేణుక తెలిపారు. సోమవారం ఐచ్ఛిక సెలవును రద్దు చేసినట్లు ఆమె చెప్పారు.

అనాధ శరణాలయానికి కూరగాయలు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్థానిక వంగాయగూడెంలోని మదర్‌థెరిస్సా అనాధ శరణాలయానికి హేలాపురి రూరల్ లయన్స్ క్లబ్, శ్రీచైతన్య టెక్నోస్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో కూరగాయలు, పండ్లు పంపిణీ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ గవర్నర్ కెవి.కిషోర్‌కుమార్ తెలిపారు. ఆలాగే చాటపర్రు రోడ్డులోని గల అంధుల ఆశ్రమంలో క్లబ్ అధ్యక్షులు వి.విష్ణుకుమార్ సమక్షంలో కూరగాయాలను, పండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య టెక్నోస్కూల్ ప్రిన్సిపల్ కెఎస్ఎస్.మాధవ్, లయన్స్‌క్లబ్ రూరల్ కోశాధికారి కె.లక్ష్మయ్యతో పాటు కె.వేణుగోపాల్, కె.భాస్కర్‌రావు, డి.భాస్కర్‌రావు, స్కూలు అకాడమిక్ డీన్ సిహెచ్.ఉదయ్ భాస్కర్, ప్రైమరీ ఇన్‌ఛార్జి శివకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

ముస్లిముల శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - చింతలపూడి

మహ్మద్ ఫరూక్‌ను హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని చింతలపూడి పట్టణ స్థానిక అంజుమానే మహాఫీజూల్ ఇస్లాంకమిటీ సభ్యులు కోరారు. ఆదివారం మసీదు నుంచి శాంతిర్యాలీగా బయలుదేరి బోసుబొమ్మ సెంటర్ వద్ద మానవహారంగా నిలబడ్డారు. ఇలాంటి దుర్ఘటన జరగడం బాధాకరమన్నారు. మహ్మద్‌ఫరూక్‌ను హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసేలా, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని చింతలపూడి సిఐ పి.రాజేష్‌కు, ఎస్ఐ సిహెచ్.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అ ందజేశారు.



ఏలూరు భాష్యం స్కూల్లో కేక్ కట్ చేస్తున్న శివనారాయణరెడ్డి

ఘనంగా కొత్తసంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక బెనర్జీపేటలోని భాష్యం ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ విద్యాసంస్థల జోనల్ అధికారి ఎ.శివనారాయణరెడ్డి, ప్రిన్సిపల్ జి.కోటేశ్వరరావు, లిటిల్ ఛాంప్స్ ప్రిన్సిపల్ బి.సంధ్యారాణి, విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో కేక్ కట్‌చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కోటేశ్వరరావు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో విద్యార్థులు రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం భాష్యం సిల్వర్ జూబ్లీ లోగోను ఆవిష్కరించారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక అమ్మానాన్న వికలాంగ సేవాశ్రమంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిడిపి నాయకులు పెనుమర్తి రామ్‌కుమార్ మాట్లాడుతూ వికలాంగులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం స్వీట్లు పంచి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు మండెల నాగరాజు, డి.ఆంజనేయులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో కేక్ కట్‌చేస్తున్న రామ్‌కుమార్

సామ్రాజ్యవాద సంస్కృతిని వీడాలంటూ ర్యాలీ

బుట్టాయగూడెం :దేశంలో సామ్రాజ్యవాద విషసంస్కృతిని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఎస్.రామ్మోహన్ అన్నారు. మండల కేంద్రంలో పిడిఎస్‌యు టివైఎల్, పిఒడబ్ల్యు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను నిషేధించాలంటూ ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్ వద్ద సభ నిర్వహించారు. ఈ సభనుద్దేశించి పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ నూతన సంవత్సర ఉత్సవాల పేరుతో యువతను చెడుమార్గం పట్టిస్తున్నారన్నారు. 31వ తేదీ రాత్రి యువత పార్టీల పేరుతో ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో కోట్లాది రూపాయులను మద్యంద్వారా గడిస్తుందన్నారు. విదేశీ సంస్కృతీ సంప్రదాయాలను ఇక్కడ అమలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. అనంతరం టివైఎల్ డివిజన్ నాయకులు టి.బాబూరావు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని శ్రామికవర్గ సంస్కృతిని అలవర్చుకోవాలన్నారు. నూతన సంవత్సరంలో విద్యార్థి, యువత తమ సమస్యలతో పాటు ప్రజాసమస్యలపై ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. పిఒడబ్ల్యు రాష్ట్ర నాయకురాలు వెట్టి భారతి మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల పేరుతో యువతను ప్రధానంగా కేంద్రీకరించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో పి.భూషణం నాగేశ్వరరావు, అరుణ, పోతిరెడ్డి, రాజు, వెంకటలక్ష్మి, మంగరాజు, పాల్గొన్నారు.

పోలవరం : నూతన సంవత్సర సంబరాల పేరిట యువత మద్యం వినోదాలతో సమయాన్ని వృథా చేయొద్దని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి జి.ప్రసాద్ అన్నారు. పోలవరం గ్రామంలో సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ప్రగతిశీల మహిళా సంఘం, సాంస్కృతిక సంఘం, పివైఎల్, పిఒడబ్ల్యు, ఐఎఫ్‌టియు సంయుక్తంగా ఆదివారం ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ప్రధాన రహదారులపై రాలీ చేస్తూ సామ్రాజ్యవాద విషసంస్కతిని వ్యతిరేకించాలని నినాదాలు చేశారు. అనంతరం స్థానిక బాపూజీ కాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, ఐఎఫ్‌టియు మండల నాయకులు రామానుజుల సత్యన్నారాయణ, వెలుగంటి రాజు, లత, 200 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

సౌకర్యాల్లేకుండా నిర్మాణాలు : సిపిఎం

నిర్వాసితుల మోడల్ గృహాలను పరిశీలించిన నేతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



నిర్వాసితుల మోడల్ గృహాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురవుతున్న విలీన మండలాల నిర్వాసితులకు పునరావాసం కోసం మండలంలో నిర్మిస్తున్న మోడల్ గృహాలను సిపిఎం బృందం ఆదివారం పరిశీలించింది. అనంతరం సిపిఎం అప్‌ల్యాండ్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.రవి, నాయకులు తెల్లం రామకృష్ణ, ఉడతా వెంకటేష్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నిర్వాసితులు త్యాగ మూర్తులంటూ ప్రభుత్వం నిరంతరం వారిపేరు జపం చేస్తుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణవ్యయం కంటే పునరావాసానికి అత్యధికంగా నిధులు కేటాయిస్తున్నామంటూ ఆర్భాట ప్రచారాలు చేయడం సరికాదన్నారు. ప్రస్తుతం నిర్వాసితులకు పునరావాసం కల్పించే ప్రాంతాల్లో సౌకర్యాలు నామమాత్రంగా ఉన్నాయన్నారు. నిర్మాణంలో ఉన్న మోడల్ గృహాలు కేవలం రెండు గదులతోనే నిర్మిస్తున్నారని తెలిపారు. ముంపునకు గురయ్యే ప్రాంతంలో నిర్వాసితుల ఇళ్లు విశాలంగా ఉన్నాయని ఆ ప్రాంతంలో సర్వస్వం కోల్పోతున్న పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడంలో వివక్ష కొనసాగుతుందన్నారు. మరోపక్క 2018 నాటికి ప్రాజెక్టు పూర్తి చేస్తామంటూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయని ఇక్కడ మాత్రం కాలనీ నివాస గృహాలు నిర్మించడం లేదన్నారు. నిర్మించిన ఇంటిలో ఇద్దరు మాత్రమే ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. నిర్వాసితుల కోసం నిర్మిస్తున్న కాలనీల్లో అన్ని సదుపాయాలూ కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

మద్యం మత్తులో పోలీసులపై దాడి

యువకుడు అరెస్టు

ప్రజాశక్తి - తణుకు రూరల్

మద్యం మత్తులో ఓ యువకుడు కానిస్టేబుల్‌పైనా, హోంగార్డుపైనా దాడికి పాల్పడ్డాడు. దీంతో విషయం తెలుసుకుని అక్కడికి వెళ్లిన ఎస్‌ఐపై కూడా దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి తణుకు పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆదినారాయణ కథనం మేరకు.. ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్థానిక వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద పలు కార్యక్రమాలను చేపట్టారు. అర్ధరాత్రి సమయంలో పూటుగా మద్యం తాగి అక్కడికి వచ్చిన మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన జక్కంశెట్టి సాయికుమార్ గలాటా సృష్టించాడు. దీంతో విషయం తెలుసుకున్న కానిస్టేబుల్, హోంగార్డ్ అక్కడికి చేరుకుని అతడిని నిలువరించే ప్రయత్నం చేయగా వారిపై రాయితో దాడి చేశాడు. ఈ విషయం తెలుసుకుని తణుకు పట్టణ ఎస్‌ఐ ఆదినారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకునే లోపు అతనిపైన కూడా సాయికుమార్ దాడికి పాల్పడ్డాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయికుమార్‌కు అండగా అధికారపార్టీకి చెందిన నాయకులు కేసు నమోదు చేయొద్దంటూ పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు గాయపరిచినందుకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఆదినారాయణ తెలిపారు.



కొత్తగా ఏర్పాటు చేసిన బౌన్సర్లు

పాలకొల్లులో 'బౌన్సర్లు'

ప్రజాశక్తి - పాలకొల్లు

ఇప్పటివరకూ బడాబడా నగరాలకే పరిమితమైన బౌన్సర్లను నూతన సంవత్సరం సందర్భంగా పాలకొల్లు టౌన్ హాలులో ఏర్పాటు చేశారు నూతన సంవత్సరం సందర్భంగా గతంలో పర్వులు మాత్రమే పరిశీలించేవారు. ప్రస్తుతం అనుమతి లేకుండా లోనికి ఇతరులు ఎవరూ వెళ్ళకుండా నలుగురు బౌన్సర్‌లను ఏర్పాటు చేశారు పాలకొల్లులో గతంలో ఎప్పుడూ బౌన్సర్‌లు ఏర్పాటు చేసిన సంఘటన లేదు. దీనిపై పట్టణ సిఐ బి.కృష్ణకుమార్‌ను వివరణ కోరగా ప్రయివేటు సెక్యూరిటీలో భాగంగా బౌన్సర్‌లను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. బౌన్సర్‌లను ఏర్పాటు చేసిన విషయం తమ దృష్టికి రాలేదన్నారు. పట్టణంలో అవాంఛనీయ సంఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మౌజన్ హంతకులను శిక్షించండి

ప్రజాశక్తి - నల్లజర్ల

తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని లాలా చెరువు వద్ద మసీద్‌లో మౌజన్ ఫరూఖ్‌ను హత్య చేయడాన్ని నిరసిస్తూ నల్లజర్ల మండల ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నల్లజర్లలోని స్థానిక మసీదు నుండి సెంటర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రార్థన ఆలయాలపై దాడులు హేయమైన చర్య అన్నారు. సమాజంలో ఇటువంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆయన తెలిపారు. దోషులను వెంటనే శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లజర్ల గ్రామ కమిటీ అధ్యక్షులు షేక్ మీరా, మహ్మద్ ఆలీ సాహెబ్, సర్దార్, మహ్మద్ ఇలియాజ్, బషీర్, ఖాలీషా, ముస్తాక్, షేక్ వల్లి, అహ్మద్ ఆలీ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

సంక్షేమ ఫలాలు అందించేలా కృషి

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు



టిడిపిలో చేరిన వారితో ఎంఎల్ఎ రామానాయుడు

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి కుటుంబానికీ అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని అడవిపాలెం గ్రామంలో సేవామిత్ర సాధికార మిత్రలకు నిర్వహించిన శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా స్థిరపరిచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం సుమారు 30 మంది వైసిపి నుండి ఎంఎల్ఎ సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆయన ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బోనం నాని, సర్పంచి గోడి అశోక్‌కుమార్, ఎంపిటిసి విస్సా సరస్వతి, టిడిపి మండల నాయకులు చిట్టూరి సీతారామాంజనేయులు, మాతా రత్నంరాజు, ఆరిమిల్లి రామ శ్రీనివాస్, పీతల శ్రీనివాస్, చెరుకూరి అంజిబాబు, గంధం శ్రీనివాస్ పాల్గొన్నారు.

హామీ ఇచ్చారు.. ఆచరణ మరిచారు..!


కలెక్టర్ హామీకి ఏడాది..!

పోచవరంలో నిర్మించని రోడ్డు

నాటి జన్మభూమిలో హామీ, నేటివరకూ అమలు కాని వైనం

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చారు.. అయినా ఆ గ్రామస్తులు నిరాశ చెందలేదు.. జిల్లా కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చారు. దీంతో ఇంకేంటి తమ సమస్య తీరుతుందని అందరూ భావించారు. కానీ వారి ఆశ నిరాశగానే మిగిలిపోయింది. 2017లో నిర్వహించిన నాలుగో విడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోచవరం గ్రామంలో నిర్వహించిన సభకు జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్ వచ్చారు. ఆయన గజ్జరం నుంచి పోచవరం గ్రామానికి వస్తుండగా అధ్వానంగా ఉన్న రోడ్డు స్థితిగతులను గుర్తించారు. ఈ రోడ్డుపై ప్రయాణాలు సాగించే ప్రజల కష్టాలను తీర్చాలని, రోడ్డును నిర్మించాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో పోచవరం గ్రామస్తులు సంబరపడిపోయారు. సాక్ష్యాత్తు కలెక్టర్ తమ రోడ్డ పరిస్థితిపై స్పందించారని, వాటిని నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారని ఆనందపడ్డారు. కానీ ఇది జరిగి ఏడాది గడిచింది.. మరో రెండురోజుల్లో మరో జన్మభూమి కార్యక్రమం నిర్వహించనున్నారు. కానీ నేటికీ వారి సమస్య మాత్రం అలాగే ఉండిపోయింది. అధ్వానంగా ఉన్న ఆ మార్గంలో ఫ్యాక్టరీలకు ప్రతిరోజూ భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఈ మార్గం మరింత దారుణంగా తయారైంది. రోడ్డు మధ్యలో పెద్దపెద్ద గోతులు ఉండడంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం ఈ జన్మభూమి కార్యక్రమంలోనైనా తమ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఆ గ్రామస్తులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్ ఈ సమస్యపై స్పందించి తమ ప్రాంతంలో రోడ్డును నిర్మించాలని వారు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న పోచవరం రోడ్డు



గోదావరి ఒడ్డున పడి ఉన్న మృతదేహం

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని బల్లిపాడు ఇసుకర్యాంపులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ అశోక్ కథనం మేరకు.. గోదావరి నది ఒడ్డున ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడని గుర్తించిన స్థానికులు ఆదివారం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ అశోక్ తన సిబ్బందితో అక్కడికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడు వయసు సుమారు 40 ఏళ్ల ఉంటాయని, తెలుపురంగు షర్టు, నలుపురంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. విఆర్ఒ ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - నిడమర్రు

మండలంలో తోకలపల్లి గ్రామంలో ఆదివారం కోడిపందేలు స్థావరంపై పోలీసులు దాడి చేశారు. తోకలపల్లిలో కోడిపందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో నిడమర్రు ఎస్‌ఐ ఎం.వీరబాబు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు జూదరులను అరెస్టు చేశారు. వారినుంచి రెండు కోడిపుంజులను, రెండు కోడి కత్తులను, రూ.3.690 నగదును స్వాధీనం చేసుకున్నారు.

సేవల్లో అగ్రస్థానంలో ఓఎన్‌జిసి

ప్రజాశక్తి - తాళ్లపూడి

సేవా కార్యక్రమాల నిర్వహణలో ఓఎన్‌జిసి కెజీ బేసిన్ రాజమహేంద్రవరం విభాగం అగ్రభాగంలో ఉందని ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ బి.రత్నం అన్నారు. మండలంలోని పెద్దేవం గ్రామంలో వృద్ధులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని స్వచ్ఛ భారత్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రధాని మోదీ చేపట్టిన 'స్వచ్ఛ పక్వాడా' విజయవంతం కోసం రాజమండ్రి ఓఎన్‌జిసి బేసిన్ పరిధిలో రూ.పది లక్షల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సి.సూరయ్య, న్యాయవాది కమల్ నాగేశ్వరరావు, చిగిరిపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

మద్యంతాగి ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి రూపాశంకర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం అర్బన్

నూతన సంవత్సర వేడుకల పేరుతో యువత మద్యంతాగి వాహనాలు నడుపుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదని, అది మన సంస్కృతి కాదని, మద్యం దుకాణాలు పట్ల ప్రభుత్వం నియంత్రణ చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి రూపాశంకర్ అన్నారు. ఆదివారం పిడిఎస్‌యు, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో విదేశీ సంస్కృతిని విడనాడాలని, మన సంస్కృతిని కాపాడుకుందామని పట్టణంలో పలు చోట్ల ప్రదర్శనలు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యంషాపులు రాత్రి పది గంటల వరకూ మాత్రమే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. యువత కోడి పందేలు, జూదక్రీడలకు దూరంగా ఉండాలన్నారు. ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఎం.దానవరప్రసాద్ మాట్లాడుతూ మద్యం షాపులు రాత్రి ఒంటిగంట వరకూ అనుమతులు ఇవ్వడం వల్ల యువత పెడదోవపడుతున్నారని, దీనివల్ల గొడవలు జరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు టి.రాజు, పి.భార్గవరాజు, ప్రవీన్, ప్రకాష్, సందీప్, ఎస్‌కె.షరీఫ్, క్రాంతి, గణేష్, సాయి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిఎం మాట.. ఖాతరు చేస్తారా..!

(మొదటి పేజీ నుంచి)

ప్రతియేటా పందేల జోరును పెంచుతూ వస్తున్నారు. పందేల ముసుగులో గుండాట, పేకాట, అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేసి యువతను పెడదారి పట్టిస్తున్నారు. పందేల్లో డబ్బు పోగొట్టుకుని ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక పరిస్థితి మరింత శృతిమించింది. ఏకంగా జిల్లావ్యాప్తంగా 400కుపైగా బరుల్లో కోడిపందేలు సాగుతున్నాయి. రూ.వంద కోట్లకుపైగా చేతులు మారుతున్నాయి. ప్రతియేటా కోడిపందేల దెబ్బకు ఎంతోమంది నిరుపేదల కుటుంబాల్లో విచ్ఛిన్నమవుతున్నాయి. మంత్రులు, ఎంపీలు, ఎంఎల్ఎలే తమ స్వస్థలాలను పేకాట క్లబ్‌లుగా, కోడిపందేల బరులుగా మార్చేస్తూ ప్రతియేటా జూద క్రీడలకు ఆహ్వానం పలుకుతున్నారు. కోడి పుంజులను బరిలోకి దింపుతూ గొప్పగా ఫొటోలకు ఫోజులు సైతం ఇస్తున్నారు. దీంతో పోలీసులు సైతం అటువైపు వెళ్లలేని దుస్థితి ఏర్పడుతోంది. కోడిపందేలకు అడ్డుకట్ట వేయాలని కొన్నేళ్లుగా అనేక మంది ఎస్‌పిలు తీవ్ర ప్రయత్నం చేశారు. ఆఖరి నిముషంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గక తప్పక చేతులెత్తేస్తున్నారు. గతేడాది కోడిపందేలపై కోర్టులు స్పష్టమైన తీర్పులు వెలువరించాయి. కోడిపందేలపై ప్రభుత్వాన్ని సైతం తప్పుపట్టే పరిస్థితి ఏర్పడింది. పందేల నిరోధానికి సంబంధించి కలెక్టర్, ఎస్‌పిలకు సూచనలు సైతం చేశాయి. ప్రభుత్వం కోడిపందేలకు వత్తాసు పలుకుతుండటంతో జిల్లా కలెక్టర్, ఎస్‌పిలు కోడిపందేలపై కోర్టులకు సమాధానం చెప్పుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

తొలిసారి ప్రభుత్వం నుంచి భిన్నస్వరం

ఈసారి మాత్రం కోడిపందేలపై ఉక్కుపాదం మోపుతామని డిజిపి నుంచి జిల్లా ఎస్‌పిలు వరకూ ప్రకటనలు చేస్తున్నారు. కోడిపందేలకు అడ్డుకట్టపై కోర్టు నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయంటూ డిజిపినే స్వయంగా ప్రకటించడం విశేషం. కోర్టు తీర్పునకు విరుద్ధంగా ఎంఎల్ఎలు కోడిపందేలు జరుపుతామంటూ గత కొద్దిరోజులుగా బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. దీంతో కోడిపందేలపై ఉత్కంఠ నెలకొంది. చివరికి రాజకీయ నాయకుల మాటలే చెల్లుతాయనే భావన అందరిలోనూ ఏర్పడింది. తొలిసారిగా కోడిపందేలపై ప్రభుత్వం నుంచి భిన్నస్వరం విన్పించింది. ముఖ్యమంత్రి స్వయంగా కోడిపందేలు వద్దని, ఎంఎల్ఎలు ఎవరూ పాల్గొనొద్దంటూ హెచ్చరికలు చేయడం చర్చనీయాంశంగా మారింది. సిఎం మాటలు పోలీసుల్లో కొత్త ఉత్సహం నింపినట్లయ్యింది. దీంతో కోడి పందేలపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే భీమవరం వంటి ప్రాంతాల్లో హోటళ్ల గదులన్నీ బుక్ అవడం చూస్తే కోడిపందేలు ఆగుతాయా అనే మీమాంస మాత్రం తొలగడం లేదు. సిఎం మాటను ఖాతరు చేయకుండా ప్రజాప్రతినిధులు కోడిపందేలు నిర్వహిస్తే పరిస్థితి ఏమిటనే చర్చ అంతటా కొనసాగుతోంది.

తొలి ఎస్‌పిగా అభినందనలు అందుకుంటారా

ఇప్పటి వరకూ ఎంతోమంది ఎస్‌పిలు కోడిపందేలను అడ్డుకోవాలని ప్రయత్నించినా కుదరలేదు. ఈసారి మాత్రం అందుకు సానుకూల పరిణామాలు చోటుచేసుకున్నాయి. అదే తరుణంలో జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన రవిప్రకాష్ కోడిపందేలపై చాలా సీరియస్‌గా ఉన్నారు. దీంతో ప్రభుత్వం నుంచి సైతం కోడిపందేలను అడ్డుకునే విషయంలో సానుకూలత వ్యక్తమవుతోంది. ప్రస్తుతం నిర్వహిస్తున్నట్లు మాదిరిగానే దాడులు నిర్వహించి పండుగ మూడురోజులు కోడిపందేలకు అడ్డుకట్ట వేయగలిగితే మంచి రికార్డుగానే చెప్పుకోవచ్చు. కోడిపందేలను అడ్డుకున్న తొలి ఎస్‌పిగా రవిప్రకాష్ ప్రజల నుంచి నీరాజనాలు అందుకునే అవకాశం ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో కోడిపందేలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఎండుతున్న నారు.. రైతు కంటకన్నీరు

(మొదటి పేజీ నుంచి)

రైతులు అష్టకష్టాలు పడి నారుమడులు వేశారు. అయితే కాల్వ శివార్లలో సుమారు 210 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందని పరిస్థితి నెలకొంది. దీంతో అక్కడ నారుమడులు ఎండిపోతున్నాయి. నారుమడులకు ఇప్పటికే ఎకరాకు రూ.ఐదు వేలు వరకూ వెచ్చించామని, ఇప్పుడు నీరు లేక ఎండిపోయే దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

సాగునీటి ఎద్దడి నేపథ్యంలో ముందుగానే గణపవరం ప్రాంతంలో వంతుల విధానం అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో సరిపల్లి కాల్వకు మూడు రోజులు నీటిని విడుదల చేస్తున్నారు. ఇలా విడుదల చేసిన నీటిని కాల్వకు ఎగువన గల చెరువుల యజమానులు ఇంజిన్లు వేసి తోడేస్తుండటంతో కిందకు చుక్కనీరు రావడం లేదు. పైగా చెరువుల పట్టుబడి సమయంలో నీటిని కాల్వల్లోకి తోడేయడంతో ఉప్పునీరు కాల్వలోకి చేరుతోంది. ఈ నీటినే నారుమడులకు పెట్టడంతో నారు మాడిపోతుంది. కనీసం దుక్కులకూ నీరు లేక రైతులు నానావస్థలు పడుతున్నారు. నాట్లు వేయాలంటే దుక్కి తప్పనిసరని, నీరు లేకపోతే నాట్లు ఎలా వేయగమని రైతులు ప్రశ్నిస్తున్నారు. సాగునీటి సమస్యను రైతులు మండల వ్యవసాయాధికారి కె.పార్థసారధి దృష్టికి తీసుకెళ్లగా ఆయన నీరులేక ఎండిపోతున్న నారుమడులను పరిశీలించారు. సాగునీటి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నీరందించేందుకు కృషి చేస్తామన్నారు.

వంతులవారీ విధానంలో నీరు రావడం లేదు

ఎన్.రాముడు, కౌలురైతు, సరిపల్లి

ఈ ఆయకట్టులో రెండెకరాలు కౌలుకు తీసుకుని నారుమడులు పోశాను. ప్రభుత్వం మాటలు నమ్మి నారుమడులు వేస్తే నీరు లేకుండా పోయింది. ఏం చేయాలో పాలుపోవడం లేదు. దుక్కు దున్నేందుకూ అవకాశం లేకుండాపోయింది. ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలి.

కాల్వలో ఉప్పునీరొస్తుంది

కె.సత్యనారాయణ, కౌలురైతు, సరిపల్లి

ఈ ఆయకట్టులో మూడెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. ప్రతి సంవత్సరం సాగునీటి సమస్య ఏర్పడుతుంది. ఈ సంవత్సరం నీటి సమస్య తీవ్రంగా ఉంది. కాల్వలో వస్తున్న ఉప్పు నీటి వల్ల నారుమడులు చచ్చిపోతున్నాయి. వ్యవసాయం చేయాలో.. మానాలో అర్థం కావడం లేదు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

జన్మభూమి ప్రత్యేకాధికారులు వీరే

(మొదటిపేజీ నుంచి)

డిప్యూటీ కలెక్టరు పద్మావతి, కొయ్యలగూడేనికి కెఆర్‌పురం వ్యవసాయశాఖ ఎడి కె.కమలాకరశర్మ, లింగపాలేనికి డ్వామా పీడీ గణేష్‌కుమార్, మొగల్తూరుకు భీమవరం డివిజినల్ కోఆపరేటివ్ అధికారి మురళీకృష్ణ, నల్లజర్లకు జంగారెడ్డిగూడెం క్లస్టర్ డ్వామా ఎపీడీ టి.నాగరాజు, నరసాపురానికి సెట్‌వెల్ సిఇఒ సిహెచ్.సుబ్బారెడ్డి, నిడదవోలుకు జిల్లా సహకార శాఖాధికారి భగవాన్, నిడమర్రుకు తాడేపల్లిగూడెం వ్యవసాయశాఖ ఎడి పి.మురళీకృష్ణ, పాలకోడేరుకు ఏలూరు డివిజినల్ కోఆపరేటివ్ అధికారి ఎడివి.ప్రసాద్, పాలకొల్లుకు బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, పెదపాడుకు పశుసంవర్ధక శాఖ జెడి జి.విజయమోహన్, పెదవేగికి డిఇఒ సివి.రేణుక, పెంటపాడుకు ఉద్యానశాఖ డిడి టివి.సుబ్బారావు, పెనుగొండకు మార్టేరు వ్యవసాయ శాఖ ఎడి కె.రమేష్, పెనుమంత్రకు సోషల్ వెల్ఫేర్ డిడి జెఆర్.లక్ష్మిదేవి, పెరవలికి జిల్లా బిసి సంక్షేమాధికారి లక్ష్మీప్రసాద్, పోడూరుకు సర్వశిక్షాభియాన్ పిఒ బ్రహ్మానందరెడ్డి, పోలవరానికి కాలుష్య నియంత్రణా మండలి పర్యావరణ ఇంజినీర్ కె.శ్రీనివాసరరెడ్డి, టి.నరసాపురానికి డిసిఎఒ టిబిఎంఎం.కుమార్, తాడేపల్లిగూడేనికి డిపిఒ ఎంవి.రమణ, తాళ్లపూడికి వ్యవసాయశాఖ జెడి గౌసియాబేగం, తణుకుకు అసిస్టెంట్ క్రేన్ కమిషనర్ ఎ.సీతారామారావు, ఉండికి డిఎస్‌డిఒ సయ్యద్ అబ్దుల్ అజీజ్, ఉంగ్రాజవరానికి లేబర్ డిప్యూటీ కమిషనర్ లేబర్ ఎం.రామారావు, ఉంగుటూరుకు భూగర్భజలశాఖ డిడి ఎన్.రంగారావు, వీరవాసరానికి భీమవరం వ్యవసాయ శాఖ ఎడి ఎన్.శ్రీనివాసరావు, కుక్కునూరుకు ట్రైబల్ వెల్ఫేర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సిహెచ్.వెంకటేశ్వరరావు, వేలేరుపాడుకు ఐటిడిఎ వ్యవసాయాధికారి కె.ఆనందకుమార్ నియమితులయ్యారు. మండల ప్రత్యేకాధికారులంతా సంబంధిత మండల బృందాలతో సమన్వయం చేసుకుని రోజువారీ కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేసి సంబందిత నివేదికలను ఎప్పటికప్పుడు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.


గన్నవరం నుంచి విమానాలు బయలుదేరు వేళలు

న్యూఢిల్లీకి	సమయం	వారం
ఎయిరిండియా	09.05	ప్రతిరోజూ
ఎయిరిండియా	17.20	ప్రతిరోజూ
ఎయిరిండియా	20.40	ప్రతిరోజూ
హైదరాబాద్‌కు		
స్పైస్‌జెట్	09.35	ప్రతిరోజూ
ఎయిరిండియా	13.20	బుధవారం మాత్రమే
స్పైస్‌జెట్	14.40	మంగళవారం మినహా
ఎయిరిండియా	17.20	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	17.35	ప్రతిరోజూ
ట్రూజెట్	21.55	ప్రతిరోజూ
బెంగళూరుకు		
స్పైస్‌జెట్	07.55	మంగళవారం మినహా
స్పైస్‌జెట్	20.00	ప్రతిరోజు
చెన్నైకు		
ట్రూజెట్	07.55	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	16.10	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	14.00	మంగళవారం మాత్రమే
స్పైస్‌జెట్	20.00	ప్రతిరోజు(వయా బెంగుళూరు)

కోడి గుడ్ల ధరలు



విజయవాడ	రూ. 3.51
హైదరాబాద్	రూ. 3.45
ప.గోదావరి	రూ. 3.51
తూ.గోదావరి	రూ. 3.51
విశాఖ	రూ. 3.60
చిత్తూరు	రూ 3.63
చెన్నై	రూ. 3.70
నామకల్	రూ 3.65



బులియన్ మార్కెట్

24 క్యారెట్లు : 2,986 (గ్రాము) : 29,860 (10గ్రా)

22 క్యారెట్లు :2,798 (గ్రాము) : 27,980 (10గ్రా)

వెండి : 39.27(గ్రాము) : 39,270 (కిలో)

రైల్వే టైమ్‌టేబుల్

ఏలూరు నుంచి

రాజమండ్రి వైపు

రైలు నెం.	రైలు పేరు	వచ్చు సమయం	వెళ్లుసమయం
12728	గోదావరి-హైదరాబాద్-విశాఖ	00.06	00.07
12740	గరీబ్‌రథ్-సికింద్రాబాద్-విశాఖ	02.41	02.42
18048	అమరావతి:వాస్కోడిగామా-హౌరా(సో,బు,శు,శ)	03.46	03.47
12738	గౌతమి-సికింద్రాబాద్-కాకినాడ పోర్ట్	04.06	04.07
17487	తిరుమల-తిరుపతి-విశాఖ	04.21	04.22
18510	ఎక్స్‌ప్రెస్-హెచ్-ఎస్ నాందేడ్-విశాఖ (సో,గు,శు)	04.41	04.42
18310	నాగావళి-నాందేడ్-సంబల్‌పూర్ (మ, బు, ఆది)	04.41	04.42
67300	ప్యాసింజర్-విజయవాడ-రాజమండ్రి	05.48	05.50
12718	రత్నాచల్-విజయవాడ-విశాఖ	06.51	06.52
12840	మెయిల్ -చెన్నయ్-హౌరా	07.26	07.27
18464	ప్రశాంతి-బెంగులూర్-భువనేశ్వర్	07.41	07.42
12862	లింక్-నిజాముద్దీన్-విశాఖ	07.51	07.52
13352	బొకారో-అలెప్పి-టాటానగర్	08.16	08.17
57225	ప్యాసింజర్-విజయవాడ-విశాఖ	09.47	09.48
12864	యశ్వంత్‌పూర్- యశ్వంత్‌పూర్-హౌరా	10.26	10.27
17239	సింహాద్రి-గుంటూరు-విశాఖ	10.34	10.35
22416	ఎపి ఎక్స్‌ప్రెస్ న్యూఢిల్లీ-విశాఖ	13.31	13.32
57257	ప్యాసింజర్-తిరుపతి-కాకినాడ	13.59	14.00
12806	జన్మభూమి-సికింద్రాబాద్-విశాఖ	14.27	14.28
11019	కోణార్క్-ముంబై-భువనేశ్వర్	15.08	15.09
17205	షిర్డీ- సాయినగర్ షిర్డీ-కాకినాడ టౌన్ (సో,బు,శు)	16.25	16.27
18646	ఈస్ట్‌కోస్ట్-హైదరాబాద్-హౌరా	17.38	17.39
57231	ప్యాసింజర్-విజయవాడ-కాకినాడ పోర్ట్	18.33	18.35
67261	ప్యాసింజర్-విజవాడ-రాజమండ్రి	19.46	19.47
57271	ప్యాసింజర్-విజయవాడ-రాయగడ	22.16	22.17
12704	ఫలక్‌నామా-సికింద్రాబాద్-హౌరా	22.26	22.27
	విజయవాడ వైపు		
12739	గరీబ్‌రథ్-విశాఖ-సికింద్రాబాద్	00.44	00.45
12703	ఫలక్‌నామా-హౌరా-సికింద్రాబాద్	01.39	01.40
11020	కోణార్క్-భువనేశ్వర్-ముంబై	03.06	03.07
22883	పూరీ-పూరీ-యశ్వంత్‌పూర్(శని)	03,34	03.35
67262	ప్యాసింజర్-రాజమండ్రి-విజయవాడ	05.40	05.41
57272	ప్యాసింజర్-రాయగడ-విజయవాడ	07.04	07.05
57232	ప్యాసింజర్-కాకినాడపోర్ట్-విజయవాడ	08.00	08.01
17206	షిర్డీ ఎక్స్‌ప్రెస్-కాకినాడ-షిర్డీ (సో,బు,శని)	08.31	08.32
18645	ఈస్ట్‌కోస్ట్-హౌరా-హైదరాబాద్	09.25	09.26
12805	జన్మభూమి-విశాఖ-సికింద్రాబాద్	10.28	10.29
57258	ప్యాసింజర్-కాకినాడ-తిరుపతి	11.31	11.32
17240	సింహాద్రి-విశాఖ-గుంటూరు	12.08	12.09
22415	ఎక్స్‌ప్రెస్-విశాఖ - న్యూఢిల్లీ	12.26	12.27
13351	బొకారో-టాటానగర్-అలెప్పి	14.36	14.37
12863	హౌరా-హౌరా-యశ్వంత్‌పూర్	15.02	15.03
57226	ప్యాసింజర్-విశాఖప్నటం-విజయవాడ	15.50	15.52
12717	రత్నాచల్-విశాఖ-విజయవాడ	16.51	16.52
18047	అమరావతి-హౌరా-వాస్కోడిగామా(మ,బు,శు,ఆది)	16.58	16.59
18463	ప్రశాంతి-భువనేశ్వర్-బెంగుళూర్	17.31	17.32
17488	తిరుమల-విశాఖ-తిరుపతి	18.41	18.42
12861	లింక్-విశాఖ-నిజాముద్దీన్	19.33	19.34
67229	ప్యాసింజర్-రాజమండ్రి-విజయవాడ	19.45	19.50
12727	గోదావరి-విశాఖ-హైదరాబాద్	22.01	22.02
12737	గౌతమి-కాకినాడపోర్ట్-సికింద్రాబాద్	22.56	22.57
18309	సంబల్‌పూర్-నాందేడ్(సో,మ,ఆది)	23.47	23.48
18509	ఎక్స్‌ప్రెస్-విశాఖ-నాందేడ్(మ,బు,శని)	23.47	23.48



బహుమతిని అందుకుంటున్న ఎం.వెంకటస్వామి

విద్య, వైజ్ఞానిక పోటీల్లో

చెరకుమిల్లి హైస్కూల్‌కు రెండు బహుమతులు

ప్రజాశక్తి - ఆకివీడు

పాలకొల్లు మండలం ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్లో జరిగిన జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక సదస్సులో మండలంలోని చెరకుమిల్లి హైస్కూల్ విద్యార్థులకు రెండు విభాగాల్లో ప్రథమ బహుమతులు లభించాయి. 468 మంది తమ అంశాలను ప్రదర్శించిన ఈ పోటీల్లో తమ పాఠశాలకు రెండు బహుమతులు లభించడం పట్ల స్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.నారాయణరాజు హర్షం వ్యక్తంచేశారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి కె.జగ్గుతిపూజ ప్రదర్శించిన బహుళ ప్రయోజన గ్యాస్‌స్టౌ ప్రదర్శనకు ప్రథమ బహుమతి లభించదన్నారు. ఉపాధ్యాయ విభాగంలో తమ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు ముత్యాల వెంకటస్వామి ప్రదర్శించిన గణిత వృత్తాకార చట్రం 20 సిద్ధాంతాలు అనే అంశానికి మరో ప్రథమ బహుమతి లభించిందన్నారు. వీరు ఈ నెల మూడు, నాలుగు, ఐదు తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరిని ఎంఇఒ రవీంద్ర అభినందించారు.

ప్రణాళికాబద్ధంగా భీమవరం మున్సిపల్ బడ్జెట్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నూతన మున్సిపల్ బడ్జెట్ ప్రణాళికాబద్ధంగా రూపొందించామని, పట్టణ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని టిడిపి కౌన్సిలర్లు ఆనందం వ్యక్తం చేశారు. అయితే ఈ బడ్జెట్ సమావేశం మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమవ్వడంతో సమయం సరిపోదని వాయిదా వేయాలని వైసిపి కౌన్సిలర్లు ఛైర్మన్‌ను కోరారు. ఆయన బడ్జెట్ సమావేశం జరుగుతుందని, వాయిదా వేయడం కుదరదని చెప్పడంతో వైసిపి కౌన్సిలర్లు వాకౌట్ చేశారు. పురపాలక సంఘం 2018-19 బడ్జెట్‌ను అద్భుతంగా ఉందని అధికార తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు చెప్పుకురాగా.. వైసిపి మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. భీమవరం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం తోట సీతారామలక్ష్మీ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఛైర్మన్ కొటికలపూటి గోవిందరావు అధ్యక్షతన శనివారం జరిగింది 2018-19 బడ్జెట్‌లో అంచనాలను ప్రారంభ నిల్వ రూ.57,09,91,000 చూపించి రూ.71,79,39000ను జమగా రూ.1,26,86,40,000ను ఖర్చు చూపిస్తూ రూ.2,02,90,000ను నిల్వగా చూపారు. 13వ ఆర్థిక సంఘం నిధులు 2018-19 రివైజ్ చేసి ఈ బడ్జెట్‌లో రూ.678.79 లక్షలతో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రొవిజన్ చూపించారు. ఇక 14 వఆర్థిక సంఘం నిధులు రివైజ్ చేసి రూ.700 లక్షలుగా ఉన్న బడ్జెట్‌ను బడ్జెట్‌లో రూ.655 లక్షలు విడుదలవుతాయని చూపించారు. యథావిధిగా మోడరన్ ఫిష్ మార్కెట్ నిర్మాణం కోసం రూ.కోటి బడ్జెట్‌లో కేటాయించారు. అమృత్ గ్రాంట్‌లోని మున్సిపల్ షేర్‌ను 30 శాతంతో తాగునీటి సరఫరా అభివృద్ధి నిమిత్తం 2018-19 రివైజ్ బడ్జెట్‌లో రూ.2635 లక్షలు కేటాయించగా 2018-19లో రూ.5071 లక్షలు ప్రొవిజన్ చూపించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖకు ఐదు శాతం అంటే రూ.62.95 లక్షలు కేటాయించారు. పట్టణంలోని స్లమ్ ఏరియాల అభివృద్ధికి రూ.230.60 లక్షలు కేటాయించారు. ఒక షెడ్యూల్ కులాలు నివసించే ప్రాంతాల అభివృద్ధికి రూ.188.85 లక్షలు షెడ్యూల్ తెగలు నివసించే ప్రాంతాల అభివృద్ధికి రూ.94.45 లక్షలు కేటాయించారు. వీటితో పాటు గత బడ్జెట్‌లో ఉన్న కొన్ని ప్రతిపాదనలు కూడా ఈ బడ్జెట్‌లోకి తీసుకువచ్చారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - వీరవాసరం

దళిత సమస్యలపై పోరాడుతానని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటం స్టాలిన్‌బాబు అన్నారు. మత్స్యపురి చినపేటలో శనివారం రాత్రి జీసస్ ఫ్రెండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో చర్చ్ ఆఫ్ క్రైస్ట్ ఉభయరాష్ట్రాల ప్రెసిడెంట్ మేడిది జాన్సన్ ఆధ్వర్యంలో స్టాలిన్‌బాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.జగన్ తనపై ఉంచిన నమ్మకంతో పార్టీకి తనవంతు కృషి చేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో దళితులంతా వైసిపి నాయకులను బలపర్చాలన్నారు. పార్టీ తనను గుర్తించి ఈ అవకాశాన్ని కల్పించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్యారీస్ పెద్దలు మారంపూడి బాబ్జీ, ఎం.మోషేన్ రాజు, గోడి బాబు, ఇంజేటి సురేష్‌బాబు, గోడి ప్రదీప్, గోడి జ్ఞానరత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.



స్టాలిన్‌ను సత్కరిస్తున్న జాన్సన్

యువత సన్మార్గంలో పయనించాలి


భీమవరంరూరల్ : యువత మంచిమార్గంలో పయణించి తోటివారికి సహాయం చేయాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని పాస్టర్ నన్నేటి అభిరాజు లూథర్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక బేతనీపేట లూథరన్ చర్చిలో ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఘనంగా జరిగింది. ఈ క్రిస్మస్ వేడుకకు యూత్ ప్రెసిడెంట్ ఎస్.నీహారిక అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో టి.జాన్ ప్రకాష్, డి.వర్గిస్ డానియేల్, గంటా సుందర్‌కుమార్, పి.రాజ్‌కుమార్, ఎస్.మిలాంగ్‌టన్, పి.సుదర్శన్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎంఎల్ఎ శివ

ప్రజాశక్తి - ఉండి

నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్లు స్థానిక ఎంఎల్ఎ వేటుకూరి వెంకటశివరామరాజు అన్నారు. ఉండిలో ఇంటింటికీ టిడిపి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శివరామరాజు హాజరయ్యారు. పాములపర్రులో ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాములపర్రు, ఉండి, కొండగూడెం ప్రజలు తమ సమస్యలను వివరించారు. సమస్యలపై స్పందించిన ఎంఎల్ఎ త్వరలో పరిష్కరిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో ప్రతీగ్రామాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా పాములపర్రు దళిత శ్మశాన వాటికకు వెళ్లాలంటే ఊరు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందని, అలాకాకుండా పాములపర్రులో వంతెన నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధాన రహదారికి మరమ్మతులు చేపడతామని చెప్పారు. మండలంలోని ప్రతిపాఠశాలకూ ప్రహరీ నిర్మిస్తామన్నారు. జన్మభూమి - మా ఊరు కార్యక్రమం ద్వారా అర్హులకు పింఛన్లు, ఇళ్లు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఛైర్మన్ సాగిరాజు సాంబరాజు, వైస్‌ఛైర్మన్ జుత్తిగ నాగరాజు, పార్టీ మండల అధ్యక్షులు జుత్తిగ శ్రీనివాస్, ఉండి సర్పంచి విజయకృష్ణంరాజు, జెడ్‌పిటిసి కరిమెరక వెంకట సత్యతులసి, ఎంపిటిసి శ్రీనివాసరావు, పాములపర్రు సర్పంచి నక్కా చెన్నకేశవ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంఎల్ఎ

నూతన సంవత్సర వేడుకల్లో యువత..

ప్రజాశక్తి - నరసాపురం

నూతన సంవత్సర వేడుకలకు ప్రజలు సిద్ధమౌతున్నారు. 2017కు వీడ్కోలు చెప్పి 2018 సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. మూడు రోజులుగా మార్కెట్‌లో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. నూతన సంవత్సరం రోజున బంధువులు, మిత్రులు, అధికారులు, పెద్దవారి ఇంటికి వెళ్లేటప్పుడు పుష్పాలు, కేక్, స్వీట్లు, పవర్ బుకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతారు. దీంతో ఆయా దుకాణాలు రద్దీగా ఉన్నాయి.

కేక్‌లు

నూతన సంవత్సరంలో వేడుకల్లో ప్రజలు ఎక్కువగా కేక్‌ను వినియోగిస్తారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని బేకరీలన్నీ రద్దీగా ఉన్నాయి. పైనాపిల్, పిస్తా, బటర్‌స్కాచ్, స్ట్రాబెర్రీ, వెన్నిలా, కూల్ చాక్లెట్, డ్రై ఫ్రూట్స్, జల్ వంటి రకరకాల కేక్‌లను తయారు చేసి నిర్వాహకులు సిద్ధంగా ఉంచారు. వ్యాపారంలో పోటీ పెరగడంతో బేకరీ నిర్వాహకులు కేజీ కేక్ కొంటే 75 ఎంఎల్ డ్రింక్ అందజేస్తున్నారు.

పూలు..

అలాగే పూల దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. పూల దండలు, బొకేలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. పెద్ద బొకే రూ.200 నుంచి రూ.400 ఉండగా, చిన్న బొకేలు వంద రూపాయలకు విక్రయిస్తున్నారు.

స్వీట్లు..

నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలో ప్రముఖ స్వీట్ షాపులు వెరైటీ స్వీట్లు తయారు చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ప్రత్యేకంగా పాలకోవా, బెంగాలీ, కలకంద, గులాబ్‌జామ్, రసగుల్ల వంటి స్వీట్లను తయారు చేసి అమ్మకానికి ఉంచారు.

రంగులు..

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మహిళలు ఇంటి ముంగిట రంగవల్లులతో ముగ్గులు వేస్తుంటారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో రంగుల అమ్మకాలు ఊపందుకున్నాయి.

దుస్తులు..

నూతన సంవత్సరంలో కొత్త దుస్తులు ధరించాలనే ఆసక్తితో ప్రజలు దుస్తులు కొనడానికి ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో పట్టణంలో వస్త్ర దుకాణాలన్నీ కిటకిటలాడాయి.

బిర్యానీ..

న్యూ ఇయర్ సందర్భంగా పట్టణంలోని పలు సెంటర్లలో వ్యాపారులు బిర్యానీ పాయింట్లను ఏర్పాటు చేశారు. మటన్, ఫ్రాన్స్, మిక్చర్, దమ్ వంటి పలు రకాల బిర్యానీలను అందుబాటులో ఉంచారు.



కళ్లజోళ్లు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

లయన్స్ ఆధ్వర్యాన ఉచిత కంటి వైద్యశిబిరాలు

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని పలుగ్రామాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. మండల కేంద్రమైన ఉండిలో, ఎన్ఆర్‌పి అగ్రహారం, చెరకువాడ, కోళ్లమూరు, ఉప్పులూరు గ్రామాల్లో ఈ శిబిరాలు నిర్వహించి వైద్యపరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు భూపతిరాజు వెంకటరాజు, రుద్రరాజు నర్సరాజు, కునాధరాజు రామసూరి, కెవి.రామారావు, డి.బాపిరాజు, సాయిరామ్, కాగిత మహంకాళి, గాదిరాజు రంగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తణుకు పట్టణం తేతలి గ్రామంలో టిడిపి సోషల్ మీడియా వర్క్‌షాప్‌లో ప్రతిభకనబరిచిన వారికి ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల విమర్శలను సోషల్ మీడియా ద్వారా సున్నితంగా తిప్పి కొడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య మాట్లాడుతూ వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ల ద్వారా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిసి ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, ప్రధానకార్యదర్శి ఉప్పులూరు చంద్రశేఖర్, పట్టణ బిసి సెల్ అధ్యక్షులు గంటా త్రిమూర్తులు, వాణిజ్య విభాగం అధ్యక్షులు వీరిపాటి గున్నేశ్వరరావు, మాతా సురేష్‌బాబు, మద్దుల సాయి వెంకటకృష్ణమూర్తి, ఇ.సాయి మణికంఠ అభినందించారు.

కొత్త సంవత్సర వేడుకలు రద్దు

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రతిఏటా తన ఇంటి వద్ద నిర్వహించే నూతన సంవత్సర వేడుకలను రద్దు చేసినట్లు టిడిపి మండల అధ్యక్షులు పోలిశెట్టి సత్యనారాయణ(దాసు) ఆదివారం తెలిపారు. అనివార్య కారణాల వల్ల రద్దు చేసిన ఈ వేడుకలను పార్టీ నాయకులు, అధికారులు, అభిమానులు గమనించాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో నూతన సంవత్సర వేడుకలను యువత ఉత్సాహంగా నిర్వహించింది. అర్ధరాత్రి కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. వ్యాపార సంస్థలన్నీ కిటకిటలాడాయి. ముఖ్యంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేస్తూ వేసే ముగ్గులకు వాడే రంగుల అమ్మకాలు విరివిగా సాగాయి. మెయిన్ రోడ్డులో దారిపొడవునా రంగుల అమ్మకాల దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. బిర్యానీ షాపులు రద్దీగా మారాయి. మద్యం దుకాణాలు మందుబాబులతో హోరెత్తాయి. అర్ధరాత్రి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిజేస్తూ ఉల్లాసంగా గడిపారు. గ్రామాల్లో ఎక్కడికక్కడ ద్విచక్ర వాహనాలపై యువకులు హడావుడి చేశారు. అయితే వాహనాలు మితిమీరిన వేగంతో యువకులు నడుపుతుండడంతో స్థానికులు వ్యాపారులు భయాందోళనకు గురయ్యారు.

ప్రజాశక్తి
పశ్చిమ గోదావరి
సోమవారం 1 జనవరి 2018



ఆశల ప్రవాహానికి.. ఆనంద స్వాగతం..

ఇక సెలవంటూ 2017 నిష్క్రమించగా.. నేనున్నానంటూ 2018 ఆవిష్కృతమైంది.. ఉప్పొంగే ఉత్తేజంతో.. కొత్త సంవత్సరాన్ని స్వాగతిద్దాం.. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ.. కొత్త ఆశలకు ఊపిరి పోస్తూ.. అభ్యుదయాన్ని ఆకాంక్షిద్దాం.. నూతన సంవత్సరంలో ప్రజా పాలకుల మనోగతాలు వారి మాటల్లోనే..

దొంగరావిపాలెం ఎత్తిపోతల నిర్మాణమే లక్ష్యం



పితాని సత్యనారాయణ, కార్మిక శాఖా మంత్రి

ప్రజలందరికీ 2018 నూతన సంవత్సర శుభాకాంక్షలు. కొత్త సంవత్సరంలో ప్రజల విజ్ఞప్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతాం. సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించేలా పటిష్ట చర్యలు తీసుకుంటాం. నియోజకవర్గంలో రైతులకు అత్యంత ప్రధానమైన దొంగరావిపాలెం శాశ్వత ఎత్తిపోతల పథకాన్ని ఈ ఏడాది పూర్తి చేసేలా ముందుకు సాగుతాను. కోడేరు-గన్నవరం వంతెన నిర్మాణంపై దృష్టిసారించి అనుకున్న లక్ష్యాలను చేరుకుని ప్రజలకు మరిన్ని సేవలందించేలా నూతన సంవత్సరంలో ముందుకు సాగుతాం.

కొవ్వూరును ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



కెఎస్.జవహర్, ఎక్సైజ్ శాఖా మంత్రి

ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. కొవ్వూరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాను. డిగ్రీ కళాశాల స్థాపనకు కృషి చేస్తాను. గ్రామీణ, పట్టణ ప్రజలకు గోదావరి జలాలను తాగునీటిగా అందించేందుకు కృషి చేస్తాను. ఆనందమయ, ఆనంద, ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాను. ప్రజలకు ఏ సమస్య వచ్చినా నా దగ్గరికి వస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తాను.

గోదావరి యూనివర్సిటీ స్థాపనే లక్ష్యం



పైడికొండల మాణిక్యాలరావు, దేవాదాయ శాఖ మంత్రి

కొత్త సంవత్సరంలో తాడేపల్లిగూడెంలో గోదావరి యూనివర్సిటీని స్థాపించడమే లక్ష్యం. ఈ సంవత్సరం నిట్ భవన నిర్మాణాలు చేపట్టి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తాం. రూ.7.5 కోట్లతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నిర్మిస్తాం. పీజీ సెంటర్‌లో కొత్త కోర్సుల ప్రారంభానికి కృషి చేస్తాను. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఇండస్ట్రియల్ కారిడార్‌ను నిర్మించేందుకు చర్యలు చేపడతాను. దీనిపై సిఎం సానుకూలంగా స్పందించారు. వచ్చే సంవత్సరం చివరి నాటికి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం. పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించడంతోపాటు ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేస్తాం.

175 నియోజకవర్గాల్లో నంబర్‌వన్‌గా ఉండడమే ధ్యేయం



చింతమనేని ప్రభాకర్, విప్, దెందులూరు ఎంఎల్‌ఎ

2018లో నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో దెందులూరును నంబర్‌వన్‌గా నిలిపి అభివృద్ధిలో ముందు వరుసలో నిలిపేందుకు నూతన సంవత్సరంలో కృషి చేస్తాను. ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించేందుకు చర్యలు చేపడతాను.


ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తా..



ఎం.ఎ.షరీఫ్, విప్, ఎంఎల్‌సి

వచ్చే సాధారణ ఎన్నికలకు కొత్త సంవత్సరంలో ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తాను. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేస్తా. మైనార్టీ, ముస్లిముల సమస్యలు, ఇబ్బందులను తెలుసుకుని పరిష్కరించే దిశగా కృషి చేస్తాను. ఎంఎల్‌ఎ మాధవనాయుడుతో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతాను.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



రాము సూర్యారావు, ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి

జిల్లా ప్రజలకు, ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఎంఎల్‌సిగా ఉపాధ్యాయుల సమస్యలపై శాసన మండలిలో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ఉపాధ్యాయ సంఘాలు చేసే పోరాటాలకు పూర్తి మద్దతు ఇస్తాను. రానున్న సంవత్సరంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాను. ప్రజలు ఆడంబరాలకు డబ్బులు ఖర్చు చేయకుండా సేవా కార్యక్రమాలకు ఆ సొమ్మును వినియోగించాలి.

అభివృద్ధి పనులు పెద్దఎత్తున చేపడతాం..



తోట సీతారామలక్ష్మి, రాజ్యసభ సభ్యురాలు

వచ్చే ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసేలా రానున్న సంవత్సరంలో ప్రత్యేక కృషి చేస్తాం. ప్రస్తుతం సాగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేయడంతోపాటు మరిన్ని పనులు పెద్దఎత్తున చేపడతాం. సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేలా కృషి చేస్తాను. ప్రతిఒక్కరికీ లబ్ది అందేలా చర్యలు చేపడతాను.

పేదలందరికీ ఇళ్లు నిర్మించడమే లక్ష్యం..



గోకరాజు గంగరాజు, నరసాపురం ఎంపి

పేదల సంక్షేమానికి ప్రధాని నరేంద్రమోడీ అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తాను. దీంతోపాటు పార్టీ బలోపేతానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నాను. దాన్ని అమలు చేస్తాను. పేదలందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వడమే మా లక్ష్యం.

కొల్లేరు సమస్యను పరిష్కరించడమే కర్తవ్యం..



మాగంటి వెంకటేశ్వరరావు (బాబు), ఏలూరు ఎంపి

నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను. ఈ ఏడాది కొల్లేరు సమస్య పరిష్కారం కావాలని ఆకాంక్షిస్తున్నాను. అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు పూర్తికావాలని, అమరావతి పనులు వేగంగా సాగాలని దృఢంగా కోరుకుంటున్నాను. ప్రజలు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెంది 2018లో సుఖమయ జీవితం గడపాలని ఆకాంక్షిస్తున్నాను.

విలీన గ్రామాలు, రోడ్ల అభివృద్ధిపైనే దృష్టి



బడేటి బుజ్జి, ఏలూరు ఎంఎల్‌ఎ

కొత్త ఏడాదిలో అడుగుపెడుతున్న నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఏలూరును స్మార్ట్‌సిటీగా తయారు చేసే లక్ష్యంలో భాగంగా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ముందుకు సాగుతాం. విలీన గ్రామాలు, రోడ్ల అభివృద్ధిపైనే 2018లో ప్రత్యేకంగా దృష్టి సారించనున్నాను. 12 వేల ఇళ్లనిర్మాణాన్ని పూర్తి చేసి పేదలకు ఇచ్చేందుకు అన్ని చర్యలూ తీసుకుంటాం.

ప్రజా సమస్యలపై పోరాడటమే కర్తవ్యం..



ఆళ్ల నాని, ఎంఎల్‌సి

జిల్లాలో ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నూతన సంవత్సరంలో ముందుకెళ్తాం. జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సరంలో మంచి జరగాలని కోరుకుంటున్నాను.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



పీతల సుజాత, చింతలపూడి ఎంఎల్‌ఎ

చింతలపూడి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాను. పేదలకు ఇళ్ల నిర్మాణంతోపాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తాను. జంగారెడ్డిగూడెం పట్టణంలో నిరుపేదలకు ఎన్‌టిఆర్ అర్బన్ హౌసింగ్, ఎర్రకాలువ జలాశయం నుండి రక్షిత తాగునీటి పథకాలను సకాలంలో నిర్మించేందుకు కృషి చేస్తాను. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని సకాలంలో పూర్తిచేయడంతోపాటు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాను.


లింకురోడ్లను బిటి రోడ్లుగా అభివృద్ధి చేస్తా



మొడియం శ్రీనివాసరావు, పోలవరం ఎంఎల్‌ఎ

నూతన సంవత్సరంలో నియోజకవర్గంలోని అన్ని గిరిజన గ్రామాల్లో ఎల్ఇడి బల్బుల ఏర్పాటుకు కృషి చేస్తా. ప్రతి గిరిజన, కొండరెడ్డి గ్రామాలను కలిపే లింకు రోడ్లను బిటి రోడ్లుగా అభివృద్ధి చేస్తాను. జీలుగుమిల్లి నుండి రాజమండ్రి వరకూ నాలుగులైన్ల రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తున్నాం. గిరిజనేతర పేదలకు గృహనిర్మాణం పథకం ద్వారా ఇళ్లు నిర్మించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తాను.

మోడల్ నియోజకవర్గంగా పాలకొల్లు..



నిమ్మల రామానాయుడు, పాలకొల్లు ఎంఎల్‌ఎ

నియోజకవర్గంలో ప్రస్తుతం అమలు చేస్తున్న అన్ని పనులనూ కొత్త సంవత్సరంలో పూర్తి చేసి పాలకొల్లును మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా. పట్టణంలో ఎన్‌టిఆర్ కళాకేంద్రం, ఎన్‌టిఆర్ గృహ సముదాయం, అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం, రామగుండం పార్కు, శంభునిచెరువు పార్కు, మున్సిపల్ అతిథిగృహంతోపాటు హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులను పూర్తి చేసి మున్సిపాల్టీ శత వసంతోత్సవం ఘనంగా నిర్వహించాలని భావిస్తున్నా. గ్రామాల్లో పుంత రోడ్లను గ్రావెల్ రోడ్లుగా మార్చి రైతాంగానికి 24 గంటలు విద్యుత్ అందేలా చూస్తా. ప్రతిఒక్కరి సొంతింటి కలను నిజం చేస్తా.

టెక్నాలజీని ప్రజలకు చేరువ చేస్తా..



అంగర రామ్మోహన్‌రావు, ఎంఎల్‌సి

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా గృహ నిర్మాణం, రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థను మరింత మెరుగుపర్చి టెక్నాలజీని ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తాను. శివారు ప్రాంతాలకు కూడా తాగు, సాగునీరు అందించేలా కృషి చేస్తాను. బడుగు, బలహీనవర్గాలకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటాను. గ్రామాల్లో వైద్య సదుపాయం మెరుగుదలకు, రేషన్ అందరికీ అందేలా చర్యలు చేపడతాను.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తాం..



వేటుకూరి వెంకట శివరామరాజు, ఉండి ఎంఎల్‌ఎ

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతాను. రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాను. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, మహిళా సాధికారత సాధన, నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించడమే లక్ష్యం. డంపింగ్ యార్డులు, పుంత్ల, సిమెంట్ రోడ్లు, ఆర్‌అండ్‌బి రోడ్లు నిర్మించనున్నాం. ఆలం ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా సురక్షిత తాగునీటిని అందించడంతోపాటు ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వనున్నాం. అందరికీ ఇళ్లు నిర్మిస్తాం.

నూతనోత్సాహంతో ముందడుగు..



మంతెన సత్యనారాయణరాజు (పాందువ్వ శ్రీను), ఎంఎల్‌సి

నూతన సంవత్సరంలో ప్రతిఒక్కరూ అన్నివిధాలా అభివృద్ధి చెందాలన్నదే నా కోరిక. కొత్త ఏడాదిలో నూతనోత్సాహంతో ముందడుగు వేసేందుకు ప్రణాళిక రూపొందించాను. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందించడమే లక్ష్యం. ప్రజల కోసం ప్రభుత్వం చేపట్టే కొత్త పథకాలన్నింటినీ అందరికీ అందేలా కృషి చేస్తాను.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం ఎంఎల్‌ఎ

2018లో నియోజకవర్గ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు చేపడతాను. నల్లజర్లలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. గోపాలపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, యర్నగూడెంలో 132 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్నాం. తాడిపూడి కాల్వ పనులను అదనపు నిధులతో పూర్తి చేస్తాం. నియోజకవర్గంలో అన్ని గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, భూగర్భ డ్రెయినేజీ నూరుశాతం నిర్మాణానికి కృషి చేస్తాను.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా..



బండారు మాధవనాయుడు, నరసాపురం ఎంఎల్‌ఎ

నూతన సంవత్సరంలో నరసాపురాన్ని జిల్లాలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాను. రోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను పూర్తి చేస్తాను. వశిష్ట గోదావరిపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తాను. అభివృద్ధి పథకాలన్నీ ప్రజలకు అందేలా చర్యలు చేపడతాను.

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణమే లక్ష్యం



బూరుగుపల్లి శేషారావు, నిడదవోలు ఎంఎల్‌ఎ

నిడదవోలులో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణమే ప్రధాన లక్ష్యంగా కొత్త ఏడాదిలో పని చేస్తాను. నియోజకవర్గంలో ఇప్పటికే 90 శాతం హామీలను నెరవేర్చాను. దీర్ఘకాలంగా అధ్వానంగా రోడ్లను అభివృద్ధి చేశాం. రైతుల ఇబ్బందులు తొలగేలా కాల్వల ప్రక్షాళనకు చర్యలు చేపట్టాం. మిగిలిన సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కొత్త సంవత్సరంలో కృషి చేస్తాను.

ఇళ్ల స్థలాల పంపిణీకి ప్రాధాన్యతనిస్తా..



గన్ని వీరాంజనేయులు, ఉంగుటూరు ఎంఎల్‌ఎ

కొత్త సంవత్సరంలో ఇళ్లస్థలాల పంపిణీకి ప్రాధాన్యత ఇస్తాను. తమ్మిలేరు జలాలను తాగునీటిగా భీమడోలు ప్రాంత గ్రామాలకు అందించడానికి నీరు-చెట్టు పథకంలో చర్యలు చేపడతాను. జాతీయ రహదారిపై భీమడోలు, చేబ్రోలు, ఉంగుటూరు, కైకరం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కృషి చేస్తున్నాను. ఉంగుటూరు, కైకరం వద్ద నిర్మాణానికి సాంకేతిక అనుమతులు లభించాయి. భీమడోలు, చేబ్రోలు వద్ద భూసేకరణ చేపట్టనున్నారు. ఈ పనులకు త్వరలోనే శంకుస్థాపన చేస్తాం. కొల్లేరు కాంటూరు కుదింపుపై కొత్త ఏడాదిలో నిర్ణయం వెలువడనుంది. ఆర్‌అండ్‌బి రోడ్లకు మరమ్మతులు చేపడతాం.

పది వేల ఇళ్ల నిర్మాణమే ధ్యేయం



ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు ఎంఎల్‌ఎ

నియోజకవర్గంలో 10 వేల ఇళ్లు నిర్మించడమే ప్రధాన లక్ష్యం. తణుకులో ఐదు వేలు, రూరల్ ప్రాంతంలో ఐదు వేలు ఇళ్లు నిర్మిస్తున్నాం. వేల్పూరులో మోడల్ కాలనీ నిర్మిస్తాం. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా సమ్మర్ స్టోరేజీ పనులు వేగవంతం చేస్తాం. ఆటోనగర్ సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తాను. తణుకు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు విద్య, వైద్యం, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలపై ప్రధానంగా దృష్టి సారిస్తాను.

ప్రతి పేద కుటుంబానికీ పక్కా ఇల్లు



పులపర్తి రామాంజనేయులు, భీమవరం ఎంఎల్‌ఎ

నియోజకవర్గంలో ప్రతి పేద కుటుంబానికీ పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యం. ఇప్పటికే పట్టణంలో పేదలకు ఇచ్చేందుకు 9,500 ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. 2019 జనవరి నాటికి వీటిని పేదలకు అందిస్తాం. ముఖ్యంగా పట్టణంలో ప్రధాన సమస్యలైన ట్రాఫిక్, డంపింగ్‌యార్డు, బైపాస్‌రోడ్డులో రైల్వేగేటు ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేస్తాను. వీరవాసరం, భీమవరం మండలాల్లో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించి రాష్ట్రంలోనే భీమవరం నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తాను.

మంచి పోలీసింగ్ అందించడమే లక్ష్యం..



రవిప్రకాష్, జిల్లా ఎస్‌పి

మంచి పోలీసింగ్ అందించి జిల్లాలో శాంతిభద్రతలను కాపాడటమే లక్ష్యంగా 2018లో ముందుకు సాగుతాం. ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఈ ఏడాది నేరాల సంఖ్య తగ్గించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తాం. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ప్రజల ఫిర్యాదులపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయిస్తాం. పోలవరం ప్రాజెక్టు భద్రత, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో నెలకొన్న సమస్యలపై ప్రధాన దృష్టి పెడతాం. భూకబ్జాలను నిరోధించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటాం. పోలీసులకు సహకరించాలని కోరుతూ జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

పాలకొల్లులో న్యూ ఇయర్ సందడి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో నూతన సంవత్సర వేడుకల సందడి నెలకొంది. ఆదివారం పట్టణంలోని పండ్లు, స్వీట్లు, బేకరీ దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ఈ సారి పాత సంవత్సర వీడ్కోలు ఆదివారం రావడంతో పట్టణంలోని చికెన్, మటన్ దుకాణాలు పెద్ద ఎత్తున ఖాతాదారులతో నిండిపోయాయి. నూతన సంవత్సర వేడుకలకు స్వాగతం పలుకుతూ పెద్ద ఎత్తున కళ్యాణ మండపాలు, కమ్యూనిటీహాళ్లు, వివిధ సంఘాలు, అధికారులకు ముందుగానే రిజర్వు అయిపోయాయి. పట్టణంలోని రెస్టారెంట్లు విద్యుత్ దీపాల అలంకరణలతో స్వాగతం పలుకుతున్నాయి. పలు హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రత్యేక దమ్ బిర్యానీ, చికెన్ బిర్యానీ, ఫ్యామిలీ ప్యాక్‌లతో కూల్‌డ్రింక్స్‌తో ప్రత్యేక ఆఫర్లు ప్రకటించడంతో పెద్ద ఎత్తున ఆర్డర్లు కూడా వస్తున్నట్లు రెస్టారెంట్ యజమాని చినమిల్లి గణపతి తెలిపారు. పట్టణంలోని కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్, టౌన్‌హాలు, లయన్స్ కమ్యూనిటీహాలు, వాసవీ కళ్యాణ మండపం, గామాస్ కళ్యాణ మండపాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశారు. ప్రత్యేక మ్యూజికల్ నైట్ ప్రోగ్రామ్స్‌తో అలరిస్తున్నారు. యువత మద్యం మత్తులో బైక్‌లపై రేసులు నిర్వహించకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు సిఐ కె. రజనీకుమార్ తెలిపారు. అర్ధరాత్రి ఒంటి గంట దాటాక ఎట్టి పరిస్థితుల్లో రహదారులపై యువత తిరగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అర్ధరాత్రి 12 గంటలకు కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కేక్ కట్ చేయనున్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న బొకేలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న రంగులు

పెనుగొండ : నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పెనుగొండలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా రెస్టారెంట్లు, బేకరీలు, మిఠాయి దుకాణాలను అందంగా అలంకరించారు. ముందుగానే కేక్‌లకు ఆర్డర్లు ఇవ్వడంతో వాటిని అందగా తీర్చిదిద్ది ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఇచ్చేందుకు పలువురు పోటీ పడుతున్నారు. పెనుగొండ ప్రధాన వీధుల్లో యువత కేరింతలతో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

సెల్‌ఫోన్లలోనే.. శుభాకాంక్షలు

తగ్గిన గ్రీటింగ్ కార్డుల వాడకం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం అర్బన్

కాలం మారుతోంది.. దీంతోపాటు మనిషి జీవన విధానం కూడా మారుతోంది. ఈ క్రమంలో ఎన్నో కొత్త కొత్త విషయాలు నేర్చుకుంటూ పాత జ్ఞాపకాలను మరిచిపోతున్నారు. మారుతున్న కాలంతోపాటు శుభాకాంక్షలు చెప్పుకునే పద్ధతులు మారుతున్నాయి. ఒకప్పుడు ఎవరైనా శుభాకాంక్షలు తెలపాలంటే గ్రీటింగ్ కార్డులు ఇచ్చి చెప్పేవారు. అయితే నేడు వాటికి శుభం కార్డు పడిపోతోంది. ప్రస్తుతం ఏ శుభాకాంక్షలైనా వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో చెబుతున్నారు.



గ్రీటింగులు

గ్రీటింగ్స్ దుకాణాలు వెలవెల..

ఒకప్పుడు జనవరి 1 వస్తుందంటే వారం రోజుల నుంచి ఒకటే హడావుడీ ఉండేది. మార్కెట్లో ఎన్నో దుకాణాలు వెలిసేవి. రకరకాల రంగులతో, మోడల్స్‌లో అందమైన గ్రీటింగ్‌లు దుకాణాల్లో కొలువుదీరేవి. అయితే ఇదంతా గతం మాట ఇప్పుడు మార్కెట్లో ఆ వాతావరణం కనిపించడం లేదు. ఒకటి, రెండు షాపుల్లో మాత్రమే గ్రీటింగ్ కార్డులను విక్రయిస్తున్నారు. అవి కూడా విక్రయాలు లేక వెలవెలబోతున్నాయి. పెరుగుతున్న టెక్నాలజీ మనిషిని ఎటువైపు తీసికెళుతుందో తెలీదు గాని మనుషుల మధ్య దూరాన్ని మాత్రం పెంచుతోంది అనటంలో సందేహం లేదు.

గ్రీటింగ్స్ సరదా లేదు
తేజ, తాడేపల్లిగూడెం

ఒకప్పుడు జనవరి ఒకటో తేదీ వచ్చిందంటే నాన్న ఇచ్చిన డబ్బులతో గ్రీటింగ్స్ కొని వాటి మీద స్నేహితుల పేర్లు రాసి ఇచ్చి శుభాకాంక్షలు చెప్పేవాన్ని. నా స్నేహితులు కూడా గ్రీటింగ్స్ ఇచ్చేవారు. ఇప్పుడా ఆ సరదాలేదు. బిజీ లైఫ్‌లో శుభాకాంక్షలు తెలపడానికి కూడా తీరిక లేదు. అందుకే ఇలాంటి సందర్భాలు వచ్చినప్పుడు సెల్‌ఫోన్‌లో ఒక మెసెజ్‌తో సరిపెడుతున్నారు. ఈ పద్ధతి మారాలి.

గ్రీటింగ్ కార్డులు కనిపించడం లేదు
వెంకట్, తాడేపల్లిగూడెం

పెరుగుతున్న టెక్నాలజీ వల్ల మనుషుల మధ్య దూరం కూడా పెరిగింది. స్మార్ట్ ఫోన్లు వచ్చాక అందరూ శుభాకాంక్షలు సామాజిక మధ్యమాల్లోనే తెలుపుతున్నారు. గ్రీటింగ్ కార్డ్స్ ఎక్కడా కనిపించడం లేదు.

నరసాపురం: నూతన సంవత్సరం వచ్చిందంటే ఒకప్పుడు 15 రోజులు ముందు నుంచే పట్టణ, గ్రామాల్లో దుకాణాల వద్ద గ్రీటింగ్‌లు సందడి చేసేవి. హీరోయిన్లు, దేవుళ్లు, ఇతర బొమ్మలతో కూడిన గ్రీటింగ్‌లు మార్కెట్‌లో దొరికేవి. వాటి వెనుక అందంగా చేతిరాతతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ చాక్లెట్లు, బిస్కెట్లు అందజేసేవారు. నేడు స్మార్ట్‌ఫోన్ ప్రభావంతో గ్రీటింగ్‌లు కనుమరుగవుతున్నాయి. వాటి స్థానంలో వాట్సాఫ్ మెసెజ్‌లు హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో గ్రీటింగ్ కార్డులు కొనేవారి సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోంది. గతంలో పాఠశాల స్థాయి నుంచి ఉద్యోగులు, వృద్ధుల వరకూ గ్రీటింగ్ కార్డులను ఇచ్చిపుచ్చుకునేవారు. నేడు రోజురోజుకూ సెల్‌ఫోన్ హవా పెరగడంతో గ్రీటింగ్ వాడకాలు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం గ్రీటింగ్స్ దుకాణాలు వెలవెల బోతున్నాయి. ప్రస్తుతం పాఠశాలల విద్యార్థులు, చిన్న పిల్లలు మాత్రమే గ్రీటింగ్ కార్డులను ఉపయోగిస్తున్నారు. గ్రీటింగులను కొనుక్కుని రాసి అందజేస్తే ఆ ఆనందమే వేరని ప్రజలు అంటున్నారు. సెల్‌ఫోన్ హవా పెరగడంతో గ్రీటింగ్‌లు కనుమరుగవుతున్నాయని దుకాణాదారులు అంటున్నారు.


కేక్‌ను కట్ చేస్తున్న గీతాంజలి విద్యార్థులు, అధ్యాపకులు

గీతాంజలిలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - భీమడోలు

గీతాంజలి విద్యాసంస్థల్లో 2018 నూతన సంవత్సర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎం.గౌతమ్‌కుమార్ కేక్ కట్ చేసి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఆటల, ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 సంవత్సరంలో విద్యార్థులందరూ బాగా చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ విద్యాసంస్థల భీమడోలు కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఎం.ఉదయ్ కిరణ్, మణింద్ర, బాలాజీ పాల్గొన్నారు.

ఎన్‌జిఒల సంక్షేమానికి కృషిచేస్తాం

ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు

ప్రజాశక్తి - భీమడోలు

ఎన్‌జిఒల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానని ఉంగుటూరు ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు అన్నారు. ఎపి ఎన్‌జిఒ భీమడోలు తాలుకా యూనిట్ ప్రచురించిన 2018 క్యాలెండర్‌ను ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాలుక యూనిట్ అధ్యక్షులు ఎం.మహిధర్, యూనిట్ కార్యకలాపాలు, సంఘ పటిష్టత సభ్యుల సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషి వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘ జిల్లా అధ్యక్షులు ఆర్‌ఎస్.హరినాథ్, కార్యదర్శి శ్రీనివాస్, ఇతర సభ్యులు భీమడోలు కేంద్రంగా యూనిట్ కార్యాలయాల ఏర్పాటుకు అవసరమైన భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని ఎంఎల్‌ఎకు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. అనంతరం ఎన్‌జిఒలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎంఎల్‌ఎ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో భీమడోలు తాలుకా యూనిట్ కార్యదర్శి పొన్నా శ్రీనివాస్, ఇతర కార్యవర్గ సభ్యులు కెఎన్‌వి.వర్మ, వివి.నాగలక్ష్మి, డి.అంబేద్కర్, కిరణ్‌కుమార్, సింహాచలం పాల్గొన్నారు.

మౌజన్ హత్యకు కారకులను శిక్షించండి

ప్రజాశక్తి - తణుకు రూరల్

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని మసీదులో మౌజన్‌ను హత్యచేసిన నిందితులను తక్షణం అరెస్టు చేయాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు బళ్ల చినవీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వేల్పూరులోని స్థానిక కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత సామరస్యంతో ఉంటున్న హిందు, ముస్లీముల మధ్య చిచ్చుపెట్టేందుకు సంఘ విద్రోహ శక్తులు ఉద్దేశపూర్వకంగా ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటారన్నారు. దుండగులు మసీదును, ఖురాన్‌లను సాక్షికంగా తగలబెట్టడం, హిమామ్ నమాజ్ చేసే తివాచీపై మూత్రం పోయటం వంటివి చేసి వారి మత మనోభావాలను కించపరచటం దుర్మార్గమని ఆయన అన్నారు. ఈ సమావేశంలో తిరునాధం వెంకటేశ్వరరావు, వాసంశెట్టి వెంకట్రావు, కరేళ్ల అర్జున్, గుంటూరి శ్రీనివాస్, విశ్వానాధం సుబ్బారావు పాల్గొన్నారు.

సర్కారు విధానాలతోనే నిర్మాణరంగంలో సంక్షోభం

భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్లే భవన నిర్మాణరంగం సంక్షోభంలో కూరుకుపోయిందని భవన నిర్మాణకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు అన్నారు. ఆ సంఘం ఏరియా కమిటీ సమావేశం ఆదివారం సరిదే అబ్బులు అధ్యక్షతన స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం, జిఎస్‌టి అమలు చేయడం వల్ల నిర్మాణరంగం మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, దీనివల్ల పనులు లేకుండా పోయాయని అన్నారు. ఇనుము టన్ను రూ.35వేల నుండి 52 వేలు, ఇటుకలు రూ.వేయ్యి నుంచి రూ.ఐదు వేలు పెరిగాయని, వీటితో పాటుగా సిమెంటు, రంగులు, చిప్స్, కలప, మెటీరియల్ పెరిగిన ధరలుపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధరలపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు దాటిన నిర్మాణ కార్మికులకు పింఛను ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పి.రాజు, వెంపల శ్రీనివాసరావు, ఆమంచి వీరబాబు, చల్లారావు, సానా బాలాజీ, పామర్తి మహేష్, గుండా శ్రీను, తాతమంట్లు తిరపన్న, చంద్రు హరిబాబు పాల్గొన్నారు.

తణుకులో ఇంటింటా వైద్యసేవలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్, ఇండియన్ పబ్లిక్‌స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటింటికీ వైద్యసేవలు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వేల్పూరు, తణుకు పట్టణాల్లో సుమారు 39 మందికి డాక్టర్ వెగేశ్న సత్యనారాయణరాజు, పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ వత్సాయి వెంకటరాజు, నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ వైద్య సేవలందించారు. నల్లజర్ల రంగారావు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె ఇచ్చిన మందులను ఆర్థికస్తోమత లేనివారికి ఉచితంగా పంపిణీ చేశారు. ఆహార నియమాలను వివరించారు. సంఘం కార్యాలయంలో ఆధునాతన యంత్ర వైద్య పరికరాలతో నిపుణులైన వైద్యులు డాక్టర్ జగదీష్ నేతృత్వంలో అందరికీ అందుబాటులో ఉండేవిధంగా ఫిజియోథెరపి సెంటర్‌ను నిర్వహిస్తున్నామని, దీన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ అసోసియేషన్ అధ్యక్షులు గడికేట్ల కేశేశ్వరరావు, సీనియర్ సభ్యులు రామారావు పాల్గొన్నారు.


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

ఘనంగా వాసుబాబు జన్మదినోత్సవం


వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న వాసుబాబు

ప్రజాశక్తి - నిడమర్రు

వైసిపి ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) పుట్టినరోజు వేడుకలు ఆదివారం భూవనపల్లిలోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని వైసిపి నాయకులు కార్యకర్తలు, పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు వాసుబాబును కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెదనింద్రకొలను పిహెచ్‌సికి మూడుఫ్యాన్లు ఆయన అందించారు. అదేవిధంగా పేదలకు గణపవరంలో బట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల రామలింగరాజు, సంకు సత్యకుమార్, సాగిరాజు జానకిరామరాజు, నిమ్మల అమ్మనరావు, దండు రాము, రామమూర్తి, కాకర్ల శ్రీను, గణపవరం సర్పంచి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ సేవలను విస్తృతపరుస్తాం

ప్రజాశక్తి - గణపవరం

రానున్న కాలంలో వాసవీక్లబ్ సేవలు మరింత విస్తృత పరుస్తామని ఆ క్లబ్ ఇంటర్‌నేషనల్ ఉపాధ్యక్షులు నారాయణసురేష్ చెప్పారు. స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి వర్తకసంఘం భవనంలో గణపవరం వాసవీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నికున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షునిగా మల్లికార్జునరావు, సంయుక్త కార్యదర్శిగా మానేపల్లి వెంకటఫణి భూషణ్‌రావు, కోశాధికారిగా పిఎన్‌విఎస్- ఎస్.ప్రసాద్ (నాగబాబు), ఉపాధ్యక్షునిగా పచ్చిపులుసు నాగేశ్వరరావు, నారాయణం మాణిక్యగుప్తా ఎన్నికయ్యారు. అనంతరం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు ఆటల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆ క్లబ్ రీజనల్ ఛైర్‌పర్సన్ జూలూరి కాశీవిశ్వానాధం, జోన్ ఛైర్ పర్సన్ చుక్కర్ల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

కొత్త ఏడాదిలోనైనా అభివృద్ధిపై దృష్టి పెట్టండి : సిపిఎం

ప్రజాశక్తి - గణపవరం

రాష్ట్ర ప్రభుత్వం కనీసం నూతన సంవత్సరంలోనైనా గొప్పలు చెప్పడం మాని అభివృద్ధిపై దృష్టి సారించాలని సిపిఎం గణపవరం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.ఆంజనేయులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి 2018లో మరింత కృషి చేస్తామన్నారు. ఇళ్ల స్థలాలు, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కూడా లేని ఈ పరిస్థితిని పాలకులు అంగీకరించడానికి సిద్ధంగా లేరన్నారు. కొంతమంది మితిమీరిన అభివృద్ధిని చూపించి గొప్పలు పోవడం తప్ప సాధారణ ప్రజల జీవన విధానంలో మార్పులు తీసుకురావడానికి చేసే ప్రయత్నాలు శూన్యమని అన్నారు. నూతన సంవత్సరంలో ఈ అంశాలన్నింటిని ప్రజల్లో చర్చకు పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో పెచ్చేటి నరసింహామూర్తి, నరాలశెట్టి రామకృష్ణ, మేడిశెట్టి పెంటారావు, కవల వెంకటేశ్వరరావు, వేండ్ర సత్యనారాయణ పాల్గొన్నారు.

2018లో పోరాటాలు విస్తృతం

ప్రజాశక్తి - గణపవరం

ఉద్యోగుల, కార్మికుల సమస్యలపై 2018లో విస్తృతంగా పోరాటాలు నిర్వహిస్తామని సిఐటియు గణపవరం ఏరియా నాయకులు నారపల్లి రమణారావు, కె.ఝాన్సీ, ప్రభాకరావు తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు గ్రీటింగులను వారు ఆదివారం విడుదల చేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిగంటలు, కనీస వేతనాలు, ఇతర సౌకర్యాలను కల్పించాలన్నారు. కొన్ని పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు. కొత్త సంవత్సరంలో ఈ సమస్యలపై కార్మికులను సంఘటితం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కె.త్రినాధ్, సందక చంద్రయ్య, జయలక్ష్మి, ఉష, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

బస్టాండులో మరుగుదొడ్లు నిర్మించండి

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు బస్టాండ్ వద్ద మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో బస్టాండు వద్ద మరుగుదొడ్లు ఉండేవి. అయితే వాటిని సక్రమంగా నిర్వహించకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ఈ బస్టాండుకు వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

రాష్ట్ర మంత్రి పైడికొండల మాణిక్యాలరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్ ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాల పరిశుభ్రతను ప్రతిఒక్కరూ పాటించాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్లపైనా, డ్రెయినేజీల్లో వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. ప్రభుత్వ స్థలాల్లో ఖాళీప్రదేశాల్లో చెత్తను వేయడం వల్ల వ్యాధులు వ్యాపిస్తాయని అన్నారు. పరిశుభ్రతపై యువత, విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. స్వచ్ఛంధసంస్థల సభ్యులు, సినీ హిరో అభిమాన సంఘాల సభ్యులు సేవా కార్యక్రమాలతో పాటు వారానికి రెండు గంటలు కేటాయించి స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అంబ్‌బి ఎఇ సత్యనారాయణ, కె.పెంటపాడు సర్పంచి చినబాబు, కాపుసంఘం నాయకులు మాకా శ్రీనివాసరావు, బిజెపి నాయకులు నరిసే సోమేశ్వరరావు పాల్గొన్నారు.


చెత్తను తొలగిస్తున్న మంత్రి మాణిక్యాలరావు

జనరిక్ మందులతో పేదలకు మేలు

విద్యావేత్త అలుగు ఆనందశేఖర్

ప్రజాశక్తి-గోపాలపురం

వైద్యం, మందులు ఖరీదైపోయిన నేటి తరుణంలో జనరిక్ మందులు పేదలకు అందుబాటులోకి రావడం అభినందనీయమని విద్యావేత్త అలుగు ఆనందశేఖర్ తెలిపారు. ఆదివారం గోపాలపురం వెంకటేశ్వరస్వామి దేవాలయం వీధిలో బేతాళ ఇందిర ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అమన్ ప్రజామందుల షాపు (జనరిక్ మందుల షాపు)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజంగా మానవునికి ఉన్న ప్రాణభయాన్ని అడ్డుగా పెట్టుకొని ప్రముఖ మందుల కంపెనీలు తయారీదారులు ప్రజాధనాన్ని దోచుకొంటున్నారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా 65 వేలరకాల మందులు తయారవుతున్నాయని తెలిపారు. కాగా ఐదువేల రకాల ప్రముఖ కంపెనీల మందులను మాత్రమే డాక్టర్లు సిఫార్సు చేస్తున్నారన్నారు. రోగులకు వైద్యం నిమిత్తం కొద్దిపాటి ఖర్చయ్యే మందులు వాడించకుండా ఆర్థికపరమైన దోపిడీ ఎక్కువగా చేస్తున్నారని అన్నారు. జనరిక్ మందులకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధి ముద్దన మురళి, లయన్స్‌క్లబ్ అధినేత గుబ్బా లక్ష్మణరావు, అలుగు జ్ఞానేశ్వరి, బేతాళశ్రీను పాల్గొన్నారు.



జనరిక్ మందుల షాపును ప్రారంభిస్తున్న అలుగు ఆనందశేఖర్

ప్రజాసంక్షేమమే సర్కారు ధ్యేయం

ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు



చెక్కులను అందిస్తున్న ఎంఎల్ఎ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - దేవరపల్లి

ప్రజల సంక్షేమమే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయమని గోపాలపురం ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. దేవరపల్లిలో తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 16 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన రూ.7.18 లక్షల విలువైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని, వాటిని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి దేవరపల్లి మండల అధ్యక్షులు కొయ్యలమూడి చినబాబు, సొసైటీ అధ్యక్షులు అక్కిన సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు సూరి శివచంద్రరావు, అనిశెట్టి ప్రభాకర్‌రావు, టిడిపి మండల కార్యదర్శి కె.రవికుమార్ పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే సైన్స్‌ఫెయిర్

నిడదవోలు:విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్‌లు ఎంతగానో దోహదపడతాయని శశి విద్యా సంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ అన్నారు. స్థానిక శశి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు సైన్స్‌ఫెయిర్ మంచి వేదిక అన్నారు. సిఐ ఎం.బాలకృష్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులను విద్యా పరంగా విద్యతో అభివృద్ధి చేయడంతో పాటు ఇలాంటి సైన్స్ ఫెయిర్‌లలో తమ నైపుణ్యాన్ని తీర్చిదిద్దుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.కృష్ణమోహన్, ఎంఇఓ పి.వి.పాపారావు, పరిపాలనాధికారి సిహెచ్.కనకరాజు పాల్గొన్నారు.

చాగల్లులో పోటాపోటీ వ్యాపారాలు

ప్రజాశక్తి - చాగల్లు

నూతన సంవత్సరం సందర్భంగా చాగల్లు మండల పరిధిలో స్వీట్లు, పండ్లు, పూల షాపులు, రంగుల షాపులతో పాటుగా బిరియానీ సెంటర్లు విడివిడిగా పోటాపోటీగా ఏర్పాటు చేశారు. రూ.50 నుంచి రూ.150 వరకూ ధరలతో రకరకాల ప్యాకింగ్ చేయడం ఏర్పాటు చేశారు. వివిధ పార్టీల నాయకులు, యువకులు పార్టీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాగే చర్చీల వద్ద ప్రత్యేక ప్రార్థనలు ఏర్పాటు చేయడం, బాణా సంచా కాల్చేందుకు ఏర్పాటు చేస్తున్నారు. స్వీట్లు, కేకులు, పూల షాపుల వద్ద నూతన సంవత్సర సందర్భంగా అధికారులు, వివిధ రాజకీయ నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు.



రంగుల దుకాణం



రెడీ అవుతున్న బిర్యాని

జన్మభూమిని చిత్తశుద్ధితో నిర్వహించండి

రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జవహర్

ప్రజాశక్తి - కొవ్వూరు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని అధికారులు చిత్తశుద్ధితో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖమంత్రి కెఎస్.జవహర్ అన్నారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో కొవ్వూరు నియోజకవర్గంలోని అధికారులతో జన్మభూమి కార్యక్రమంపై ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సాధికార మిత్రలను నియమించామని తెలిపారు. నియోజకవర్గంలో 17,368 మంది గృహాలు కావాలని దరఖాస్తు చేసుకున్నారన్నారు. కొవ్వూరులో 26,633 సమస్యలు వచ్చాయని అన్నారు. రాష్ట్రంలో మొత్తం 37 లక్షల ప్రజల సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో రేషన్ కార్డుల నిమిత్తం 4,259 మంది దరఖాస్తులు చేసుకున్నారని అన్నారు. పింఛన్ల కోసం 4,532 మంది దరఖాస్తులు చేసుకున్నారని అన్నారు. సమాజ వికాసంలో భాగంగా అందరికీ నాణ్యమైన విద్యను అందించడం, ఆరోగ్య రక్షణ మొదలైన పది అంశాలపై చర్చిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జె.రాధారాణి, ఎఎంసి ఛైర్మన్ వేగి చిన్నా పాల్గొన్నారు.

విద్యాలయాల అభివృద్ధి అభినందనీయం

తాళ్లపూడిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మంచినీటి ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

విద్యాలయాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సాయం అభినందనీయమని తాళ్లపూడి పంచాయతీ మాజీ సర్పంచి నామన పరమేశ్వరరావు అన్నారు. తాళ్లపూడి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయంతో చేసిన అభివృద్ధికి కార్యక్రమాలను ఆయన ఆదివారం ప్రారంభించారు. తాళ్లపూడిలోని శ్రీపరస పద్మ రాజారావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1987-90 సంవత్సరాల్లో 8వ తరగతి నుండి పదో తరగతి వరకూ చదువుకున్న ఒకే బ్యాచ్‌కు చెందిన వారు 'బాల మిత్ర' అనే పేరుతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆ సంఘం ద్వారా వారు చదివిన పాఠశాలలోని సమస్యలను తీర్చడానికి చొరవ చూపారు. దీనిలో భాగంగా ఈ పాఠశాలలోని విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు సుమారు రూ.రెండు లక్షల ఖర్చుతో పాఠశాల ఆవరణలో రక్షిత మంచి నీటి బోరును, వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులంతా ఒకరిని మరొకరు పలకరించుకుంటూ ఆనందంగా కనిపించారు. అనంతరం పలువురు ఆలపించిన పాటలు, చేసిన నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కంచిపాటి సత్యసాయి, అక్కిన సురేష్, రేకపల్లి జాగన్నాధం, రామకృష్ణ, పద్మజా, జయప్రద పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం క్షేత్ర పురవీధుల్లో శ్రీవారి గ్రామోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. గజరాజు వెంటరాగా స్వామి అమ్మవార్లు తొలక్కం వాహనంపై తిరువీధుల్లో గ్రామోత్సవాన్ని అర్చకులు నిర్వహించారు. గ్రామోత్సవానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. శ్రీవారి గ్రామోత్సవ అనంతరం పాత బస్టాండ్ సమీపంలోని విలాస మండపంలో స్వామి అమ్మవార్లను ఉంచి అర్చకులు, పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి పాత కళ్యాణ మండపంలో వేడుకలు నిర్వహించారు.



బాధితునికి ఆర్థికసాయమందిస్తున్న ప్రభాకరరావు

అగ్నిప్రమాద బాధితులకు వితరణ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన ఘటనలో బాధితులు కంకిపాటి గంగరాజుకు మానవత స్వచ్ఛంద సేవాసంస్థ నాయకులు ఆదివారం ఆర్థిక సాయమందించారు. మండలంలోని గుండంపల్లి పంచాయతీ మహదేవపురం గ్రామంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా కంకిపాటి గంగరాజు గృహం పూర్తిగా దగ్ధమైంది. నిరాశ్రయుడైన గంగరాజుకు మానవాత స్వచ్ఛంద సంస్థ మండలాధ్యక్షులు దావులూరి ప్రభాకర్‌రావు ఆదివారం రూ.మూడువేల ఆర్థికసాయాన్ని అందించారు. సర్పంచి ముళ్లంగి ఝాన్సీరాణి రెండు జతల దుస్తులను, దుప్పట్లను అందించారు. అలాగే ఎంపిటిసి జంగ ప్రసాద్‌రెడ్డి, టిడిపి గ్రామ అధ్యక్షులు సంకురాతి శ్రీనివాస్‌రావు, బాటరాతి శ్రీనివాస్‌రావు, గంజి కాశీ విశ్వనాథం ఒక్కొక్కరూ రూ.500 ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో పాలేపల్లి అప్పారావు, అతిశెట్టి సుధాకర్‌రావు పాల్గొన్నారు.



శివప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

పవిత్రమైంది ఉపాధ్యాయ వృత్తి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని, అయినప్పటికీ ఉపాధ్యాయులకు మాత్రం సమాజంతో విడదీయలేని అవినావభావ సంబంధం ఉంటుందని వేగేశ్వరపురం గ్రామంలోని కెఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని అన్నారు. సమాజంలో ఉన్నత వ్యక్తులను తయారు చేసే అవకాశం ఉపాధ్యాయులకే ఉందని అన్నారు. తాను సంతృప్తిగా ఉద్యోగ విరమణ చేస్తున్నానని తెలిపారు.

చట్టాలను ఉల్లంఘించిన షాన్‌మోహన్‌పై కేసు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గతంలో ఇక్కడ ఐటిడిఎ పిఒగా పనిచేసిన షాన్‌మోహన్‌పై కేసు నమోదైంది. ఆయన ఇక్కడ పనిచేసిన సమయంలో పోలవరం ప్రాజెక్టుకు భూసేకరణ విషయంలో ఆయన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని, చట్టాలను ఉల్లంఘించి పలు అవకతవకలకు పాల్పడ్డారని పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీనిపై గిరిజనులు మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు సైతం చేశారు. దీనిపై ప్రజాశక్తిలోనూ పెద్దఎత్తున వరుసకథనాలు సైతం ప్రచురితమయ్యాయి. ఆ తర్వాత ఆయన విజయవాడ బదిలీపై వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ మానవహక్కుల కమిషన్ విచారణ చేపట్టి షాన్‌మోహన్‌పై నెంబరు 955/1/24 217 ఒసిగా కేసు నమోదు చేసింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కెఆర్‌పురం ఐటిడిఎ పిఒగా షాన్‌మోహన్ 2015 నవంబర్ నుంచి 2017 అక్టోబర్ వరకూ పనిచేశారు. ఈ సమయంలో పశ్చిమ ఏజెన్సీలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పేరుతో జరిగిన భూసేకరణలో ఈ ప్రాంత గిరిజన చట్టాలను, పీసా చట్టాలను ఉల్లంఘించి షాన్‌మోహన్ భూసేకరణ చేశారని ఈ కేసు నమోదైంది. 2017 సెప్టెంబరు నెలలో మండల ంలోని పాములవారిగూడేనికి చెందిన జి.గంగాధర్ మరో తొమ్మిది మంది గిరిజనులు స్వర్ణవారిగూడెం పంచాయతీ పరిధిలో జరిగిన భూసేకరణలో అవినీతి చోటు చేసుకుందని, భూ కేటాయింపులకు సంబంధించి 1/59, 1/70 పీసా చట్టాలు అమల్లో ఉన్నాయని తెలిపారు. 2013 భూసేకరణ చట్టం సెక్షన్ 41, సబ్ సెక్షన్ ఒకటి నుండి తొమ్మిది వరకూ భూసేకరణ విరుద్ధంగా చేపట్టారని గిరిజ నులు ఢిల్లీ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషన్ కేసు నమోదు చేసి విచారణ చేయాలని జిల్లా కలెక్టరుకు సైతం తాకీదులను పంపినట్లు ఫిర్యాదుదారుడు జి.గంగాధర్‌తో పాటు ఆ గ్రామగిరిజనులు ప్రజాశక్తికి తెలిపారు. గిరిజనచట్టాలను, పీసా గ్రామ సభలను పట్టించుకోకుండా గిరిజనులమైన తమకు అన్యాయం చేసిన వారిపై చర్యలుతీసుకోవాలంటూ ఈ నెల రెండో తేదీన కలెక్టర్ కాటంనేని భాస్కర్‌ను కలవనున్నట్లు జి.గంగాధర్ తెలిపారు.

ప్రజాశక్తి కథనాలే కదిలించాయి..

పశ్చిమ ఏజెన్సీ కెఆర్‌పురం ఐటిడిఎ పరిధిలో పోలవరం నిర్వాసితుల పేరుతో జరిగిన భూసేకరణ, అవినీతిమయంగానూ, గిరిజన చట్టాలకు విరుద్ధంగానూ జరిగింది. దీనిపై గత ఏడాది సెప్టెంబరులో ప్రజాశక్తి దినపత్రిక వరుస కథనాలను ప్రచురించింది. ఈ కథనాల్లో గిరిజనేతరులు సృష్టిస్తున్న తప్పుడు డాక్యుమెంట్లు, అప్పటి పిఒ షాన్‌మోహన్ వ్యవహరిస్తున్న తీరుతో ఈప్రాంత గిరిజనులపై జరుగుతున్న అన్యాయాన్ని బట్టబయలు చేసింది. అవినీతిని వరుస కథనాలతో ఎండగట్టింది. అక్రమ భూముల అమ్మకందారులు, భూముల అమ్మకానికి దళారులు అధికార పార్టీనాయకులే ప్రధానపాత్రదారులు కావడంతో అంతా గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోయింది. జీలుగుమిల్లి మండలంలోని రాచన్నగూడెం, దర్భగూడెం, ములగలంపల్లి, పి.అంకంపాలెం, పంచాయతీలో సుమారు నాలుగు వేల ఎకరాలకు పైగా విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలంలోని గిరిజనులకు భూమికి భూమి పేరుతో కొనుగోలు చేశారు. వాటిలో 70 శాతం భూములు గిరిజన చట్టాలకు 1/70 చట్టానికి విరుద్ధంగా ఉన్నాయి. భూసేకరణలో ఏజెన్సీలో అత్యంత ముఖ్యమైన పీసా గ్రామసభలను మచ్చుకుకూడా నిర్వహించకుండా భూ సేకరణ పూర్తి చేశారు. ఈ భూసేకరణలో కోట్ల రూపాయలు చేతులు మారినట్లు బహిరంగ విమర్శలున్నాయి. ఈ అవినీతిపై ప్రజాశక్తిలో వచ్చిన కథనాలకు స్పందించిన పాములవారిగూడెం గిరిజనులు తమకు చెందాల్సిన భూములు చేజారిపోతున్నాయని, షాన్‌మోహన్ నుంచి భూసేకరణ రాష్ట్ర అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. వారు స్పందించకపోవడంతో ఢిల్లీలో మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. గిరిజనుల ఫిర్యాదులను స్వీకరించిన కమిషన్ షాన్‌మోహన్‌పైనా, మరికొందరు గిరిజనేతర భూస్వాములపైనా కేసు నమోదు చేశారు.

రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు

ప్రజాశక్తి - టి.నరసాపురం

రైతులకు వ్యవసాయశాఖ ద్వారా వ్యవసాయ పనిముట్లు 50 శాతం రాయితీపై అందిస్తున్నామని మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం రైతులకు అనేక రాయితీలు అందిస్తుందని ఈ క్రమంలోనే తైవాన్, బ్యాటరీ స్ప్రేయర్లు, అలాగే ట్రాక్టర్ల పనిముట్లు డిస్కులు, కల్టీవేటర్లు, రోటోవేటర్లు, బరకాలు, పవర్‌టిల్లర్లను రైతులకు 50 శాతం రాయితీపై అందిస్తున్నామని చెప్పారు. ఎస్సి, ఎస్టి రైతులకు 70 శాతం, ఐదు ఎకరాలు పైబడిన రైతులకు 40 శాతం రాయితీపై అందిస్తున్నామన్నారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు పాసు పుస్తకం నకలుతోపాటు పాస్‌పోర్ట్ ఫొటోతో వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అంతేకాక సూక్ష్మపోషక ఎరువులైన ముడిజింకు, జిప్సం, బోరాన్‌లను రైతులకు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం మండలంలో రబీ సీజన్‌లో మొక్కజొన్న పంటను రైతులు సాగుచేస్తున్నారని ఈ పంటలో అధికంగా మొక్కలకు బోరాన్ లోపం కనిపిస్తుందని ఈ లోపం వల్ల మొక్క, కండి పటుత్వం కోల్పోతుందని తద్వారా దిగుబడి తగ్గిపోతుందన్నారు.

పేదలకు ఇళ్లస్థలాలివ్వాలి : సిపిఐ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జిల్లావ్యాప్తంగా అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నాగులగూడెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన గ్రామమహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డేగా ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెం పట్టణ కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ రానున్న రోజుల్లో పేదల సమస్యలపై పోరాటం చేయడానికి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కమిటీ నాయకులు కుంచే వసంతరావు, బాలఏసు, రాజబాబు పాల్గొన్నారు.

సమాజ సేవలో ఆర్యవైశ్యులు ముందు

ప్రజాశక్తి - టి.నరసాపురం



ఆంధ్రాబ్యాంకు మేనేజరు రామ్మోహనరావును సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

ఆర్థిక క్రమశిక్షణతో పాటు సమాజసేవలో ఆర్యవైశ్యులు ముందుంటారని టి.నరసాపురం ఆంధ్రా బ్యాంకు మేనేజరు డి.రామ్మోహనరావు అన్నారు. టి.నరసాపురం ఆర్యవైశ్య గ్రామసంఘం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన నల్లూరి శ్రీనివాసరావు, ఇతర కమిటీ సభ్యులకు మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు ఎం.సత్యనారాయణమూర్తి ఆదివారం అద్దంకి జగ్గారావు తోటలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రాబ్యాంకు మేనేజరు డి.రామ్మోహన్‌రావు ఇటీవల రాష్ట్రప్రభుత్వం ద్వారా ఉత్తమ బ్యాంకు మేనేజరు అవార్డు పొందిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజరు మాట్లాడుతూ సమాజానికి ఆర్యవైశ్యులు సేవలు ఎంతో అవసరమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవాకా ర్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ తనవంతు బాధ్యతను నిర్వర్తిస్తూ సంఘం అభ్యున్నతికి పాటుపడతానన్నారు. నూతన ఆర్యవైశ్య కార్యవర్గ అధ్యక్షులుగా నల్లూరి శ్రీనివాసరావు, కార్యదర్శిగా అద్దంకి చక్రధరరావు, కోశాధికారిగా మాధంశెట్టి రమేష్, ఉపాధ్యక్షులుగా దారా శ్రీమన్నారాయణ, మల్లికార్జునరావు, తొమ్మిది మంది కమిటీసభ్యులను ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సిపి ఏ.జగ్గారావు, జూలూరి గోపి, బి.భాస్కరరావు, ఎ.మహేశ్వరరావు, పి.రాము పాల్గొన్నారు.



డ్రెయినేజీ నిర్మాణాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి

నాణ్యతాప్రమాణాల పరిశీలన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి అన్నారు. ఆదివారం జంగారెడ్డిగూడెం పట్టణంలోని 18వ వార్డులో డ్రెయినేజీ నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక కౌన్సిలర్లు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలపై దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజాన సత్యనారాయణ, ముస్తాఫా, చెరుకూరి శ్రీధర్, తాతాజీ పాల్గొన్నారు.

వార్షికోత్సవాలతో నూతనోత్తేజం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వార్షికోత్సవాల వల్ల విద్యార్థుల్లో నూతనోత్తేజం పెంపొందుతుందని అపోలో ఇంగ్లీషు మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఆర్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక అపోలో ఇంగ్లీషు మీడియం స్కూల్లో శనివారంరాత్రి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులకు విద్యాపట్టాలు అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన పలుసాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించింది. ఈ కార్యక్రమంలో అపోలో ఇంగ్లీషు మీడియం స్కూల్ వ్యవస్థాపకులు అలెక్స్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యాసంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్

600 పింఛన్లు మంజూరు

కొయ్యలగూడెం :మండలానికి కొత్తగా 600 పింఛన్లు మంజూరైనట్లు ఎంపిడిఒ ఎం.రాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో 1050 లబ్ధిదారులు పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో 600 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఈ నెల రెండో తేదీన జరగబోయే జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని అర్హులకు పింఛన్లు అందజేస్తారన్నారు. అనంతరం ఎర్రకాల్వ జలాశయం కుడి కాల్వ నీటిసంఘం అధ్యక్షులు వాడపల్లి నాగార్జున మాట్లాడారు.

హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎన్నికలహామీలను నెరవేర్చడంలో టిడిపి ప్రభుత్వం విఫలమైందని సిపిఐఎంఎల్ బహుజన ప్రజారాజ్యం రాష్ట్రకార్యదర్శి అనిశెట్టి రాము అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ డివిజన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిశెట్టిరాము మాట్లాడుతూ ఎన్నికల హామీలను విస్మరించిన ప్రభుత్వం కనీసం దళిత గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టడంపై దృష్టిసారించడంలేదన్నారు. మహిళలపై అత్యాచారాలు, ఎక్కువయ్యాయన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని చెప్పారు. జిల్లా కార్యదర్శి డి.పార్వతి మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను ఆసరాగా చేసుకుని ప్రభుత్వం మద్యం వ్యాపారం, జూదక్రీడలను ప్రోత్సహిస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన చెందారు. సంక్రాంతి పండుగలో కోడిపందేలను ప్రోత్సహిస్తూ ప్రజాసంక్షేమాన్ని విస్మరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మండలపల్లి రాజు, పెదమూర్తి తిరుపతిరావు, కామన సత్యనారాయణ, సుబ్బారావు, కె.లక్ష్మి, ఎ.కుమారి పాల్గొన్నారు.



వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న సత్యనారాయణరాజు

పేదలకు చేయూతనివ్వాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పేదలను ఆదుకోవడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని హిందూ ధర్మ ప్రచార సమితి అధ్యక్షులు, మద్ది క్షేత్ర ట్రస్టుబోర్డు సభ్యులు సత్యనారాయణరాజు అన్నారు. రాజవరం గ్రామంలోని రామాలయం వద్ద పేదలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. వందమంది మహిళలకు చీరలు, 50 మంది పురుషులకు పంచెలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

క్రైస్తవుల అభివృద్ధికి చంద్రబాబు కృషి : ఎంఎల్ఎ మొడియం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

క్రైస్తవుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని పోలవరం ఎంఎల్ఎ మొడియం శ్రీనివాసరావు అన్నారు. శనివారం రాత్రి స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో మండల క్రైస్తవ ఉద్యోగ, ఉపాధ్యాయ ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పోలవరం ఎఎంసి ఛైర్మన్ పారేపల్లి రామారావు, రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్ల మేఘలాదేవి, మాజీ ఎంపిపి మట్టా సత్తిపండు, సర్పంచులు గంజిమాల దేవి, గొడ్డాటి రాణి, వైఎస్‌ఆర్‌సిపి పారేపల్లి శ్రీను, నాయకులు బొల్లిన కిషోర్, మేకల అన్నవరం, ఎంపిడిఒ ఎం.రాజు, ఉపాధ్యాయులు డిజె పీటర్సన్, వరప్రసాద్, తాడేపల్లి శ్రీను పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలకు ఎంఎల్ఎ నిమ్మల దూరం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గ ప్రజలకు, టిడిపి నాయకులకు, కార్యకర్తలకు, అధికారులకు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జనవరి 1న కార్యాలయంలో అందుబాటులో ఉండనని, ఎవరూ బొకేలు, కేకులతో తనవద్దకు వచ్చి సమయాన్ని వృథా చేయకుండా పేదలకు సాయం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

వైసిపిలోకి 9 మంది ప్రముఖులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మండలం లంకలకోడేరుకు చెందిన తొమ్మిది మంది ప్రముఖులు ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో పార్టీలో చేరారు. పార్టీ విధానాలకు ఆకర్షితులై నియోజకవర్గ కన్వీనర్ గుణ్ణం నాగబాబుకు మద్దతు ఇస్తున్నట్లు వారు తెలిపారు. వారికి నాగబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లంకలకోడేరుకు చెందిన బొండా మోహనరావు, చిందాడ వెంకటేశ్వరరావు, ఈది రాము, మత్తె అనిల్‌కుమార్, గొల్లపల్లి బాబ్జి, తోటే నారాయణమూర్తి, బందెల పృథ్వీరాజు, మురాల అయ్యప్ప, మురాల చంటి, ఈవి మర్రియ్య, దిగుపాటి దుర్గాప్రసాద్ పార్టీలో చేరారు.

ముత్యాలపల్లిలో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి జాతర ముగింపు సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ పాలకవర్గ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, సిబ్బంది సౌకర్యాలను పర్యవేక్షించారు.

తణుకులో టిడిపి సోషల్ మీడియా వర్క్‌షాపు

నరసాపురం : జిల్లా టిడిపి సోషల్ మీడియా వర్క్‌షాపును తణుకులో నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలను, పనితీరును ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అలాగే లఘు చిత్రాల ప్రదర్శన పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో నరసాపురం నియోజకవర్గం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. వారికి బహుమతి, ప్రశంసా పత్రాలను మాగంటి రూప అందజేశారు. నరసాపురం నియోజకవర్గం నుండి వెళ్లిన తెలుగు యువత సభ్యులు తీసిన లఘు చిత్రం రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన పలువురు అతిథులను ఆకర్షించింది. విజేతలను ఎంఎల్ఎ మాధవనాయుడు, ప్రభుత్వానుసపత్రి ఛైర్మన్ బండారు పటేల్ రాజానాయుడు అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నరసాపురం నుండి సోషల్ మీడియా టీం సభ్యులు కె. బాలకృష్ణ, మోహన్‌లాల్ పాల్గొన్నారు.

'గృహ నిర్మాణశాఖలో అవినీతి'

మొగల్తూరు:మొగల్తూరులోని గృహ నిర్మాణ శాఖలో అవినీతి చోటుచేసుకుందని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి బళ్ల శ్రీనివాస్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ఎన్‌టిఆర్ గృహాలు మంజూరు చేసిందని, దీనికి విరుద్ధంగా అధికారులు అర్హులకు ఇళ్లు మంజూరు చేయకుండా సొమ్ములు ఇచ్చిన వారికే మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో పిప్పళ్ల సుబ్రహ్మణ్యం, గన్నాబత్తుల భాను, అడ్డాల వీర వెంకట సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, వీరవల్లి బాల పాల్గొన్నారు.

పండగలకు.. ఏటిఎం షాక్

నగదు లేక ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఒక పక్క క్రిస్మస్, మరో పక్క నూతన సంవత్సరం, సంక్రాంతి వేడుకల్లో నిమగ్నమై ఆనందంగా గడపాలన్న ప్రజల ఆశలను బ్యాంకు ఏటిఎంలు నిరాశపరుస్తున్నాయి. నూతన సంవత్సర వేడుకలకు ఖర్చు చేసేందుకు సొమ్ము తీసుకోవడానికి ఏటిఎంకు వెళ్తున్న వారు ఏటిఎంలు పనిచేయకపోవడంతో వెనుదిరుగుతున్నారు. దీంతో ఇరుగు, పొరుగు వారి నుంచి చేబదులుగా సొమ్ము తీసుకోవాల్సిన పరిస్థితి. ఐదు రోజులుగా పట్టణంలోని ఏటిఎంలు అంతంతమాత్రంగానే పనిచేయడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కెనరా బ్యాంకు ఏటిఎం పనిచేయడం లేదని పెట్టిన బోర్డు

ముగిసిన విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించేందుకు విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా విద్యాశాఖాధికారి సివి.రేణుక తెలిపారు. ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ స్కూల్లో రెండురోజులుగా నిర్వహించిన జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు శనివారం సాయంత్రంతో ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవ సభకు ముఖ్యఅతిథిగా డిఇఒ రేణుక హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం అభివృద్ధి సాధించాలంటే దీనికి విద్యార్థుల మేధాశక్తి, సామర్థ్యాలు ఎంతో అవసరమన్నారు. సుమారు 500 పాఠశాలల నుండి 1500 లకు పైగా ప్రదర్శించిన ఎగ్జిబిట్స్‌ను ఆమె పరిశీలించి సంతోషించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందేశారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ మద్దూరి సూర్య నారాయణమూర్తి, ఎంఇఒ ముదునూరి రంగరాజు, మాంటిస్సోరీస్ అధిపతులు ఎంఎస్ వాసు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

దేవాదాయ శాఖా మంత్రి పైడికొండల మాణిక్యాలరావు



సమావేశంలో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు

ప్రజాశక్తి - మొగల్తూరు

తీర ప్రాంత ఆరాధ్య దేవత బండి ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. ఆదివారం ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఇఒ నల్లూరి సతీష్‌కుమార్, ఛైర్మన్ దాసరి అమ్మాజీ మర్యాదపూర్వక స్వాగతం పలికారు. అనంతరం బిజెపి మండల శాఖ అధ్యక్షుడు దాసరి బాబి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి, స్థల సేకరణకు కృషి చేస్తామన్నారు. యాత్రికుల సౌకర్యార్థం భోజన వసతి, విశ్రాంతికి డార్మెంటరీ, ప్రత్యేక గదులు, హైజనిక్ టాయిలెట్ల నిర్మాణం, తదితర వాటిని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. టెంపుల్ టూరిజంలో భీమవరంలోని మావుళ్లమ్మ, సోమేశ్వరస్వామి, పాలకొల్లులోని క్షీరా రామలింగేశ్వరస్వామి, నరసాపురంలోని ఎంబేరుమన్నారు స్వామి, ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయాలను దర్శించుకునేందుకు ప్రత్యేక ప్రణాళికలు చేపడతామని అన్నారు. రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని అన్నారు. ఈ సంవత్సరం 350 దేవాలయాలు నిర్మించామని, మిగిలినవి కూడా పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో దేవాదాయ శాఖకు చెందిన సుమారు రెండు లక్షల ఎకరాలు అన్యాక్రాంతం అయినట్లు గుర్తించినట్లు తెలిపారు. సర్వోన్నత న్యాయస్థానం వరకు వెళ్లి ప్రస్తుతం 50 వేల ఎకరాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ కన్వీనర్ ఎన్.సోమేశ్వరరావు, గునిశెట్టి శ్రీనివాస్, మునికోటి వెంకటేశ్వరరావు, పులపర్తి రమేష్ పాల్గొన్నారు.

వివేక స్కూల్లో ఆకట్టుకున్న రంగవల్లులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని వివేకా ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థినులు నూతన సంవత్సరానికి రంగ వల్లులతో స్వాగతం పలికారు. ఆదివారం సాయంత్రం పాఠశాల ఆవరణలో సుమారు 70 మంది విద్యార్థినులు రంగ వల్లులతో తీర్చిదిద్దారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేసిన రంగవల్లులు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ యు.గీతారాంబాబు, పాఠశాల సిబ్బంది పర్యవేక్షించి అభినందించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బహుమతులు అందించారు.

హామీల అమల్లో విఫలం : వైసిపి

ప్రజాశక్తి - ఆచంట

ఎన్నికల ముందు పేదలకు స్థలాలిస్తాం, ఇళ్లు నిర్మిస్తామని గొప్పలు చెప్పిన టిడిపి నాయకులు ఎన్నికల తరువాత ఇచ్చిన హామీలు మర్చిపోయారని వైసిపి ఆచంట నియోజకవర్గ సమన్వయకర్త కవురు శ్రీనివాస్ విమర్శించారు. ఆచంట పంచాయతీ పరిధి చినపేటలో రచ్చబండ, పల్లెనిద్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి కాలనీలో నివాసం ఉంటున్నా టిడిపి ప్రభుత్వం సెంటు భూమి కూడా ఇవ్వలేదని అన్నారు. ఒక్కో ఇంటిలో మూడు, నాలుగు కుటుంబాలు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలు ఏర్పడి మూడు దశాబ్దాలు దాటినా నేటికీ డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో దోమలతో అనారోగ్యం బారిన పడుతున్నామని కాలనీ వాసులు శ్రీనివాస్ వద్ద వాపోయారు. దీనిపై శ్రీనివాస్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం నాలుగేళ్లుగా ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వైట్ల కిశోర్, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర సీతారాం, మాజీ ఎంపిపి మట్టా ఆనంద్‌కుమార్, దొంగ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటం

ప్రజాశక్తి - నరసాపురం

విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటాలు చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి.దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక మీరా గ్రంథాలయం వద్ద ఎస్ఎఫ్ఐ జెండాను డివిజన్ అధ్యక్షులు వై.వెంకటప్రదీప్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అధ్యయనం పోరాటం, అనే నినాదంతో 1970లో కేరళలోని త్రివేండ్రంలో ఎస్ఎఫ్ఐ ఏర్పడిందని అన్నారు. గడిచిన 48 సంవత్సరాల్లో విద్యార్థుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించి దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందన్నారు. అందరికీ విద్య, అందరికీ ఉపాధి సాధనకై భవిష్యత్తులో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పి.తిరుపతి, నరసాపురం మండల నాయకులు సాయి, టి.వినయ్‌కుమార్, బిలివ్, నరేష్ పాల్గొన్నారు.

ప్రజలు ఆనందంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆచంట

రానున్న 2018 సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వైసిపి నాయకుడు వైట్ల కిశోర్ ఆకాంక్షించారు. నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ స్థానిక వైసిపి కార్యాలయంలో కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నెక్కంటి రామలింగేశ్వరరావు, ఎం.రామారావు, కోట వెంకటేశ్వరరావు, అరిగెల సురేష్‌బాబు పాల్గొన్నారు.

పెనుమంట్ర:జనవరి 1వ తేదీన నూతన సంవత్సర వేడుకలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కవురు శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు కార్యకర్తల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గస్థాయి కార్యకర్తలంతా కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు.

నరసాపురం:నరసాపురం నియోజకవర్గ ప్రజలకు ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలు సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - పాలకొల్లు

లంకలకోడేరు శివారు జొన్నలగరువు సెయింట్‌పాల్ లూథరన్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించినట్లు బిఎస్ఎన్ఎల్ రాష్ట్ర సమన్వయకర్త బొడ్డు విక్టర్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీస్తు బోధనలు అందరికీ ఆమోద యోగ్యమని గురుమండల అధ్యక్షులు కె.డేవిడ్‌రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఎల్లవేళలా అందుబాటులో రెవెన్యూశాఖ

ప్రజాశక్తి - పాలకొల్లు

రెవెన్యూ శాఖ 24 గంటలూ పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు రెవెన్యూ శాఖలో పనిచేసే మండల సర్వేయర్‌తో పాటు ఇద్దరు విఆర్ఒలు ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక కిరాణా మర్చంట్ అసోసియేషన్ భవనంలో ఆదివారం వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎల్ఎ మాట్లాడుతూ ఇటీవల పలు ప్రభుత్వ ఉన్నతాధికారులపై దాడులు చేస్తుంటే కోట్ల రూపాయల ఆస్తి బట్టబయలు అవుతోందని, అయితే ఎటువంటి అవినీతికి తావు లేకుండా ఉద్యోగులు విరమణ చేయడం అభినందనీయమని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన తహశీల్దార్ దాసిరాజు మాట్లాడుతూ మండల సర్వేయర్ ప్రస్తుతం కీలకంగా మారారని, తక్కువ మంది ఉండడంతో వీరిపై పని ఒత్తిడి ఎక్కువగా ఉందని తెలిపారు. ఆశీర్వాదం చేసిన సేవలు మరువలేనివని, పలుమార్లు జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్నారని కొనియాడారు. ఆకివీడు తహశీల్దార్ నాగార్జునరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు డిప్యూటీ తహశీల్దార్లు వీరా పోతన, డేవిడ్, మున్సిపల్ ఛైర్మన్ వల్లభు నారాయణమూర్తి, ఎన్‌జిఒ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గుడాల హరిబాబు, మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సైకిళ్లను వినియోగించాలి



సైకిల్ ర్యాలీని ప్రారంభించిన ఎస్ఎంఆర్ పెదబాబు, సుబ్బారావు

ఏలూరు సిటీ: ప్రతి మనిషీ మోటారు సైకిల్‌ను వీడి సైకిల్ తొక్కడం ద్వారా కాలుష్యాన్ని నివారించాలని ఏలూరు కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు చెప్పారు. ఏలూరు విజన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కోసం వంద మంది సభ్యులతో ఏలూరు నగరంలో సైకిల్ ర్యాలీ కార్యక్రమాన్ని ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ సుబ్బారావు ప్రారంభించారు. సుబ్బారావు మాట్లాడుతూ నగరంలో రోజురోజుకీ వాహనాల సంఖ్య పెరుగుతోందని, కాలుష్యం వల్ల ప్రజలు అనేక వ్యాధులబారిన పడుతున్నారని అన్నారు. ఇటువంటి స్థితిలో ప్రతిఒక్కరూ మోటారు సైకిళ్ల వీడి సైకిల్‌పై నగరంలో ప్రయాణించాలని, ఫలితంగా కార్బన్ డయాక్సైడ్ గాలిలో తగ్గి వాతావరణ సమతుల్యత సాధ్యపడుతుందని చెప్పారు. గతంలో వందల్లో ఉండే వాహనాలు నేడు వేల సంఖ్యకు చేరాయని, కార్లు కూడా గణనీయంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య రక్షిత నగరంగా ఏలూరును తీర్చిదిద్దినప్పుడే నగరంలో పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు చెప్పారు. ఆరోగ్యం కోసం అంతా సైకిల్ తొక్కాలని, కాలుష్య బారిన పడకుండా సమాజాన్ని రక్షించాల్సిన అవసరం అందరిపై ఉందని పెదబాబు చెప్పారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నాయకులు నాగభూషణం, సత్యం, పూడి భాస్కర రామం, డాక్టర్ రామకృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ నగరంలోని వీధుల గుండా సాగింది.

పట్టణాలకు జన్మభూమి ప్రత్యేకాధికారులు వీరే

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో జనవరి రెండు నుంచి 11వ తేద వరకూ నిర్వహించే జన్మభూమి కార్యక్రమానికి ఏలూరు నగరంతోపాటు మిగిలిన ఎనిమిది మున్సిపాల్టీలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు నగరపాలక సంస్థకు డిప్యూటీ కలెక్టర్ కరుణకుమారిని, భీమవరం మున్సిపాల్టీకి ఆగ్రోనమి డిడిఎ టి.సుధారాణి, జంగారెడ్డిగూడెం నగరపంచాయతీకి డిఎల్‌పిఒ వై.అమ్మాజీ, కొవ్వూరుకు డ్వామా ఎపీడీ ఎస్‌వివి.సత్యనారాయణబాబు, నరసాపురానికి లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎం.వెంకట్రావు, నిడదవోలు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ ఎం.మోహన్‌రావు, పాలకొల్లుకు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనరు సిహెచ్.దుర్గాప్రసాద్, తాడేపల్లిగూడేనికి వ్యవసాయ శిక్షణ కేంద్రం డిడి జగ్గారావు, తణుకు మున్సిపాల్టీకి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.పార్థసారధి నియమితులయ్యారు.

ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లాలో జనవరి రెండో తేదీ నుండి 11వ తేదీ వరకూ నిర్వహించే జన్మభూమి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోలురూమ్‌ను ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టరు కాటంనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కంట్రోలు రూమ్‌లో జిల్లాలోని 15 నియోజకవర్గాలవారీగా జన్మభూమి కార్యక్రమానికి సంబంధించి రోజూవారీ వివరాలను ఆయా నియోజకవర్గాల్లోని మున్సిపాల్టీలు, మండలాల నుండి సేకరించేందుకు 15 మంది అధికారులను, సిబ్బందిని నియమించారు. కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల నుండి సమాచార సేకరణకు సిపిఒ కార్యాలయ స్టాటిస్టికల్ ఆఫీసరు కె.శ్రీనివాసరావు, ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాలకు డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ సిహెచ్.కేశవరావు, నరసాపురం, భీమవరం నియోజకవర్గాలకు ఎన్.దుర్గాదేవి, ఉండి, తణుకులకు స్టాటిస్టికల్ ఆఫీసరు కె.బదరీనారాయణ, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు నియోజకవర్గాలకు డ్వామా కార్యాలయానికి చెందిన పిబి.శ్రీనివాస్, దెందులూరు, ఏలూరు నియోజకవర్గాలకు డిఆర్‌డిఎ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ వివికె.సత్యనారాయణ, గోపాలపురం, పాలకొల్లు నియోజకవర్గాలకు డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసరు సిహెచ్.సత్యనారాయణ, చింతలపూడి నియోజకవర్గానికి డ్వామా కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎస్ఎస్.బాలభాను నియమించారు. కంట్రోలురూమ్ పర్యవేక్షణకు సిపిఒ కార్యాలయం డిప్యూటీ డైరెక్టరు టి.సురేష్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.అప్పలకొండలను నియమించారు. ఈ కంట్రోల్ రూమ్ జిల్లా ప్రణాళికాధికారి బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

పండుగ వాతావరణంలో జన్మభూమి నిర్వహించాలి

ఇన్‌చార్జి మంత్రి పుల్లారావు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో జిల్లా అంతా పండుగ వాతావరణంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ప్రతిపాటి పుల్లారావు కోరారు. ఆదివారం జిల్లాలోని ఎంపీలు, ఎంఎల్‌సి, ఎంఎల్ఎలు, మండల, మున్సిపల్ ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో పుల్లారావు మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికేతర సమస్యలను ముందుగానే పరిష్కరించుకుని ఆర్థికపరమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ మంత్రి జవహర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు వంద నుండి 200 వరకు అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసేందుకు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు, రేషన్ కార్డులు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసేందుకు భూమి కొనుగోలు విషయంపై ముఖ్యమంత్రి వారితో సంప్రదించి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్ మాట్లాడుతూ రబీ సాగునీటి ఎద్దడి విషయంలో సీలేరు నుండి వెయ్యి క్యూసెక్కుల నీరు విడుదల చేసేందుకు, దొంగరావిపాలెం వద్ద లిఫ్ట్ మంజూరు విషయంలో జలనవరుల శాఖ మంత్రి, ఇంజినీరింగ్ ఇన్ చీఫ్‌తో మాట్లాడామని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీలు తోట సీతారామలక్ష్మి, మాగంటి మురళీమోహన్, ప్రభుత్వ విప్ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ అవసరానికి అనుగుణంగా పెన్షన్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు ఇంకా బిల్లులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని, వాటిని వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేందుకు సంబంధితాధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు. పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ జిల్లాలో రైతుల సాగునీటి సమస్య నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ లోగడ పెన్షన్ కోసం దరఖాస్తు చేసిన వారి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిశీలించి అర్హులైన వారికి మంజూరు చేయాలని కోరారు. నరసాపురం ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు మాట్లాడుతూ నరసాపురం పట్టణంలో ఇళ్ల స్థలాలు లేని 2500 మంది లబ్ధిదారులు ఉన్నారని వారికి ప్రభుత్వం తరపున భూములు కొనుగోలు చేసి పట్టాలు మంజూరు చేయడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. వేములదీవి సొసైటీలో రుణం పొందిన లబ్ధిదారులకు రుణమాఫీ ఇంత వరకు జరగలేదని, తక్షణం రుణమాఫీ జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉంగుటూరు శాసన సభ్యులు గన్ని వీరాంజనేయులు, గోపాలపురం ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వివేకానంద విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పెనుమంట్ర

తణుకు జోన్ క్రీడల్లో స్థానిక వివేకానంద స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. బాస్కెట్ బాల్ విభాగంలో వివేకానంద స్కూల్ బాలుర సీనియర్ జట్టు గెలుపొందింది. ఈ జట్టుకు షేక్ మహమ్మద్ ఆలీ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. పి.సోమిరెడ్డి కెప్టెన్‌గా ఉన్న వివేకానంద జూనియర్స్ జట్టు ద్వితీయ స్థానం సాధించిందని ఆ స్కూల్ డైరెక్టర్ కోనాల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ రెండు జట్లను స్కూల్ యాజమాన్యం తరపున గుడిమెట్ల రామిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. వీరితోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.పెద్దిరాజు, పాఠశాల కోఆర్డినేటర్ వి.సత్యహరి, వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామోపాధ్యాయులు కర్రి కృష్ణారెడ్డి, గొలుగూరి సత్యనారాయణరెడ్డి, కర్రి వినాయకరెడ్డి, వెలగల నగేష్‌రెడ్డి, అల్లం భాస్కరరెడ్డి, షేక్ రాజు తదితరులు విద్యార్థులను అభినందించారు.